
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



గుంటూరు జిల్లా వార్తలు

5

మంగళవారం 10 జూన్ 2025



ఉష్ణోగ్రత (అంచనా)

10-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	42	28
తెనాలి	42	27
నరసరావుపేట	42	28
బాపట్ల	41	29
రెంటచింతల	42	27
చీరాల	41	29



మంగళగిరిలోని సాక్షి కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న మహిళలు

కొమ్మినేనికి చీర, సారె ఇస్తాం

- అర్ధరాత్రి నల్లపాడు పీఎస్ వద్ద మహిళల నిరసన
- కొమ్మినేని, కృష్ణంరాజు, సాక్షి యాజమాన్యాన్ని శిక్షించాలని డిమాండ్

గుంటూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాజధాని మహిళలను కించపరిచే వ్యాఖ్యలు చేసిన కేసులో అరెస్టు చేసిన కొమ్మినేని శ్రీనివాసరావుకి చీర, సారె, పూలు, గాజులు ఇచ్చే అవకాశం కల్పించాలంటూ తెలుగు మహిళలు సోమవారం అర్ధరాత్రి నల్లపాడు పోలీసుస్టేషన్‌లోకి చొచ్చుకెళ్లేందుకు యత్నించారు. దీంతో తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ, నల్లపాడు సీఐ వంశీధర్‌లు అడ్డుకుని పోలీసుల అదుపులో ఉన్న నిందితులను కలిసే అవకాశం లేదని, వెళ్లిపోవాలని సూచించారు. రాజధాని మహిళలను వేశ్యలంటూ మాట్లాడిన కొమ్మినేనికి మహిళల బాధ ఒకసారి రుచి చూపిస్తామని వస్తున్న వారిని పోలీసులు బలవంతంగా బయటికి పంపారు. దీంతో వారు కొమ్మినేనికి, కృష్ణంరాజులను శిక్షించాలంటూ, వారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన సాక్షి పత్రిక, చానల్‌ను తక్షణం మూసివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ పరిశీలకురాలు భీమినేని వందనాదేవి, పశ్చిమ తెలుగు మహిళ అధ్యక్షురాలు దాసరి జ్యోతి, రాష్ట్ర కార్యదర్శి గుడిపల్లి వాణి, నేతలు లక్ష్మీ గణేష్, శివజ్యోతి, పద్మావతి పాల్గొన్నారు.



సోమవారం అర్ధరాత్రి నల్లపాడు స్టేషన్ ఎదుట నినాదాలు చేస్తున్న తెలుగు మహిళలు

క్వాలిటీ.. కుట్ర

- బర్లీ పొగాకు కొనుగోళ్లపై కంపెనీల దృష్టి
- మార్క్‌ఫెడ్ ప్రకటనతో గ్రామాలకు కంపెనీల ప్రతినిధులు
- లో క్వాలిటీ పొగాకు సంగతేమిటని ప్రశ్నిస్తున్న రైతులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

దాదాపు నెలన్నర రోజుల నుంచి బర్లీ పొగాకు కొనుగోళ్లపై కంపెనీలు స్పందించలేదు. అయితే చివరకు ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించడంతో ఇప్పుడు కంపెనీలు హడావుడి చేస్తున్నాయి. అయితే రైతుల వద్ద ఉన్న పొగాకు మొత్తాన్ని కాకుండా క్వాలిటీ అంటూ సరికొత్తగా కుట్రకు తెరలేపుతున్నాయి. గతంలో పలు దఫాలుగా సమావేశాలు పెట్టి హెచ్చరించినా అంతంత మాత్రంగానే కదిలిన కంపెనీలు ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ప్రకటనతో ఇప్పుడు కేవలం క్వాలిటీ పొగాకుపైనే దృష్టి పెట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మే చివరి వారంలో మార్టూరులో కంపెనీలతో నిర్వహించిన సమీక్షలో బర్లీ కొనుగోళ్లలో హైక్వాలిటీ (రూ.12,000), మీడియం, లోగ్రేడ్ (రూ.5,000 నుంచి రూ.6,000) రెండే రకాల ప్రామాణికాలు పాటించాలని మార్టూరులో జరిగిన సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. అయినా కొనుగోళ్లకు సంబంధించి ప్రభుత్వం ఆశించిన స్థాయిలో కంపెనీల నుంచి స్పందన లేదు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించింది. పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో లాంఛనంగా కొనుగోలు కేంద్రాన్ని కూడా మార్క్‌ఫెడ్ ప్రారంభించింది. ఈ క్రమంలో గడచిన నాలుగు రోజులుగా అనూహ్యంగా కంపెనీలు స్వరం మార్చి క్వాలిటీ పొగాకు కొనుగోళ్ల కోసం రైతుల వద్దకు ఏజెంట్లను పంపిస్తున్నాయి. మార్క్‌ఫెడ్ ప్రకటనకు ముందు క్వింటాకు (మిగతా 6వ పేజీలో)



పర్చూరులో పొగాకును పరిశీలిస్తున్న మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ (పాత చిత్రం)



ప్రభుత్వ ఆమోదమే మిగిలింది!

- పంచాయతీలకు గ్రేడ్‌లు
- పల్నాడు జిల్లాలో పూర్తయిన ప్రక్రియ
- నివేదిక పంపిన అధికారులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పంచాయతీ పాలనను ప్రభుత్వం ప్రక్షాళన చేస్తోంది. గ్రామల్లో ప్రజలకు సేవలను అత్యంత చేరువ చేసేందుకు పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తోంది. పాలన విధానంలో కూడా మార్పులు తీసుకొస్తోంది. పంచాయతీల్లో ఇప్పటి వరకు క్లస్టర్ల పాలన సాగింది. దీనికి స్వస్తి చెప్పి పంచాయతీలకు గ్రేడ్‌ల ను కేటాయిస్తోంది. ఆదాయం, జనాభా ఆధారంగా ఈ గ్రేడ్‌లు కేటాయించారు. ఈ ప్రక్రియ పల్నాడు జిల్లాలో పూర్తయింది. త్వరలోనే గ్రేడ్‌ల విధానం అమలులోకి తీసుకురానున్నారు. దీని ప్రకారం సిబ్బందిని కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

11 పంచాయతీలకు స్పెషల్ గ్రేడ్..

ప్రస్తుతం పంచాయతీలు మైనర్, మేజర్‌లుగా ఉన్నాయి. కొన్ని మైనర్ పంచాయతీలకు ఒక మేజర్ పంచాయతీని కలపి క్లస్టర్ పంచాయతీలు ఏర్పాటు చేశారు. ఈ విధానం 2010 నుంచి అమల్లోకి వచ్చింది. జిల్లాలో 529 పంచాయతీలు ఉన్నాయి. జనాభా 15,10,509 మంది. అన్ని పంచాయతీల ఆదాయం రూ.45.36 కోట్లుగా ఉంది. 11 పంచాయతీలను స్పెష ల్ గేడ్‌కు ఎంపిక చేశారు. గ్రేడ్ -1 కింద 111, గ్రే డ్ -2 కింద 169, గ్రేడ్ -3 కింద 238 పంచాయతీలను ఎంపిక చేశారు. ఈ ఎంపిక ప్రక్రియ పూర్తయింది. మూడేళ్ల సరాసరి ఆదాయాన్ని ప్రాతిపదికగా తీసుకొని గ్రేడ్‌లు కేటాయించారు. మూడేళ్లలో రూ.కోటి ఆదాయం దాటిన పంచాయతీకి స్పెషల్ గ్రేడ్ కేటాయించారు. 4 వేల నుంచి 10 వేల లోపు జనాభా ఉండి రూ.50 లక్షల నుంచి రూ.కోటి లోపు ఆదాయం ఉంటే పంచాయ తీని గ్రేడ్ -1 కింద కేటాయించారు. 2 వేల నుంచి 4 వేల లోపు జనాభా ఉన్న పంచాయతీలను ఆదాయంతో సంబంధం లేకుండా గ్రేడ్ -2 కింద ఎంపిక చేశారు. 2 వేల లోపు జనాభా ఉన్న పంచాయతీలను గ్రేడ్ -3 పరిధిలోకి తీసుకొచ్చారు. పంచాయతీల గ్రేడ్‌లపై ప్రభుత్వానికి అధికారు లు నివేదిక పంపారు. ఇక ప్రభుత్వ అమోద ముద్ర పడాల్సిందే తరు వాయి. గ్రేడ్‌ల విధానం అమల్లోకి వస్తే పంచాయతీల్లో సిబ్బంది పెరగడంతో పాటు పల్లెవాసులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది.

రేషన్ మాఫియా.. బరితెగింపు

రేషన్ డోర్ డెలివరీ లేదు. ఎండీయూ వాహనాలను ఆపేశారు. అయినా చాలాప్రాంతాల్లో ఎండీయూ ఆపరేటర్లు ఇళ్ల వద్దకు వస్తున్నారు.. రోడ్లపైనే బహిరంగంగా కార్డుదారులతో వేలిముద్రలు వేయించుకుంటున్నారు. సరుకులతో సంబంధం లేకుండా నగదు ఇస్తూ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలి స్తున్నారు. పేదల పొట్ట నింపాల్సిన ఉచిత బియ్యం మాఫియా జేబులను నింపుతోంది. అడ్డుకోవాల్సిన అధికారులు, వ్యతిరేకించాల్సిన ప్రజాప్రతినిధుల అండతో రేషన్ మాఫియా బరితెగిస్తోంది. ఎండీయూలను రద్దు చేసిన ప్రభుత్వం కార్డుదారుల సౌలభ్యం కోసం ఎక్కడైనా రేషన్ తీసుకునే సౌలభ్యంతో పాటు ఈ-పోస్‌కు కాటాలకు లింకు తొలగించడంతో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్ల సహకారంతో మాఫియా చెలరేగిపోతోంది.

ఎండీయూలు రద్దు చేసినా వారిదే రాజ్యం

- వరంగా మారిన ఈ-పోస్, కాటా లింకు తొలగింపు
- బియ్యం లేకుండానే కార్డుదారులతో బహిరంగంగా వేలిముద్రలు
- డీలర్ అవతారమెత్తిన డాన్ అనుచర ఎండీయూ ఆపరేటర్

గుంటూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రేషన్ అక్రమాలను అడ్డుకోవడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం డోర్ డెలివరీ విధానాన్ని నిలిపివేసింది. ఎండీయూ వాహనాలను రద్దు చేసింది. అయినా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో రేషన్ మాఫియా డోర్ డెలివరీ విధానాన్ని సరికొత్తగా నడుపుతోంది. ఎండీయూల స్థానే డీలర్లకు సమాంతరంగా ప్రత్యేకంగా వ్యవస్థను రూపొందించి నడిపిస్తోంది. లబ్ధిదారుల వద్దకే నేరుగా వెళ్లి సరుకులు ఇవ్వకుండానే ఇచ్చినట్లు వేలిముద్రలు తీసుకుని దర్జాగా అక్రమాలకు పాల్పడుతోంది. బహిరంగా.. నడి రోడ్లపైనే రేషన్ డెలివరీ వ్యవహారాన్ని నడిపిస్తోంది. ఇటీవల డానియేలు అనే డాన్ అనుచరుడు దర్జాగా బైక్‌పై వచ్చి గుంటూరులోని లబ్ధిదారులతో వేలుముద్రలు వేయించుకుని నగదు ఇచ్చి వెళ్లాడు. దీనిని ప్రజలు వీడియో తీస్తున్నా ఏమాత్రం వెరపు లేకుండా వ్యవహారాన్ని చక్కబెట్టుకున్నాడు. రేషన్ డాన్, అతడి అనుచర మాఫియా (మిగతా 6వ పేజీలో)

అప్పుడు.. ఇప్పుడు అతడే

గత ప్రభుత్వ హయాంలో గుంటూరు నగరంలో అనిల్ అనే వ్యక్తి రేషన్ మాఫియా కార్యకలాపాలు కొనసాగించాడు. ప్రభుత్వం మారిన తర్వాత కూడా అతడే యథావిధిగా రేషన్ మాఫియా కార్యకలాపాలు కొనసాగిస్తున్నాడనేది బహిరంగ రహస్యం. ఎండీయూలు నడపడం, అక్రమాలు చేయడంలో అను భవం పొందిన ఇతడు తన అనుచరులతో డీలర్ల వ్యవస్థకు సమాం తరంగా డోర్ డెలివరీ వ్యవస్థను కొనసాగిస్తున్నాడు. వాహనాలు, సరుకులు ఏమీ లేకుండా, ఈ-పోస్ యంత్రాన్ని తీసుకుని కార్డుదారుల వద్దకు వెళ్లి వేలిముద్రలు వేయించుకుని, చేతిలో డబ్బులు పెట్టి వస్తున్నారు. వాటాలు తీసుకుని అధికారులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు అతడికి సహక రిస్తుండడం గమనార్హం.



రోడ్డుపైనే వేలిముద్రలు వేయించుకుంటున్న డాన్ అనుచరుడు



చినపాలెం వద్ద కాల్వపై నిర్మాణం



భట్టిప్రోలు వద్ద కాల్వపై నిర్మాణం

గడువు ముంచుకొస్తోంది!

కృష్ణా పశ్చిమ డెల్టా కాల్వల మరమ్మతుల పనుల్లో కొన్ని పనుల్లో వేగం పుంజుకుంటే, మరికొన్ని పనులు నత్తనడకన సాగుతున్నాయి. పశ్చిమ డెల్టా పరిధిలోని బాపట్ల, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో ఉన్న ఆయకట్టు మొత్తానికీ సాగునీరందించేందుకు ఉన్న కాల్వలన్నీ అధ్వాన్న స్థితిలోనే ఉన్నాయి. ఈ జిల్లాల పరిధిలోని ప్రధాన కాల్వలు, ఉప కాల్వలే కాక, డ్రెయిన్‌ల మరమ్మ తులకు కూటమి ప్రభుత్వం రూ.25 కోట్లను ఓఅండ్‌ఎం నిధుల కింద మంజూరు చేసింది. ఈ నిధులతో కాల్వల పనులు పూర్తి చేయాల్సి ఉంది. దీనికి జూలై మొదటి వారం వరకు మాత్రమే అంటే 20 రోజుల గడువు ఉంది. సమయం కూడా ప్రధాన సమస్యగా ఉన్న తరుణంలో కొన్నిచోట్ల పనులు వేగం అందుకోకపోవడం రైతులను కలవరపాటుకు గురిచేస్తోంది. నిధులుండి కూడా పను లు చేయకుంటే ఈ సంవత్సరం కూడా పంట నష్టపోతామని రైతులు ఆవేదన చెందుతున్నారు.

- డెల్టా కాల్వల మరమ్మతుల్లో అక్కడక్కడా తాత్సారం
- తూటుకాడ తొలగింపులో కొన్నిచోట్ల ఆలస్యం
- నత్తనడకన డ్రెయిన్‌ల పనులు
- కట్టల పటిష్టతా అంతంత మాత్రమే
- షట్టర్లు, స్లూయిజ్‌ల వంటి కాంక్రీట్ పనులు వేగం
- జూలై మొదటి వారంలో ఖరీఫ్‌కు నీరు విడుదల
- సకాలంలో 746 పనులు పూర్తయ్యేనా?

తెనాలి, జూన్ 09(ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమ డెల్టాలో 5.71 లక్షల ఎకరాల ఆయకట్టులో ఖరీఫ్ వరి, రబీలో మొక్కజొన్న, మినుము వంటి పంటలు సాగవుతున్నాయి. గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల పరిధిలో ఉన్న ఈ మొత్తం ఆయకట్టుకు సంబంధించి కాల్వల మరమ్మతు పనులు సకాలంలో పూర్తయితేనే రేపటి ఖరీఫ్ గట్టెక్కే పరిస్థితి ఉంది. సాగునీటి కాల్వల పనుల విషయంలో కొంత వరకు పర్వాలేదనిపించినా, ప్రధానంగా డ్రెయిన్‌ల (మిగతా 6వ పేజీలో)

మిర్చియార్డులో ట్రేడింగ్ ప్రారంభం

- తొలి రోజు 27 వేలకు పైగా టిక్కీల రాక
- రూ.14,700 ధర పలికిన తేజ వెరైటీ మిర్చి

గుంటూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం గుంటూరు మిర్చి యార్డులో క్రయవిక్రయాలు పునః ప్రారంభమయ్యాయి. ఆదివారం సాయంత్రం నుంచే టిక్కీల దిగుమతికి అనుమతించడంతో సోమవారం ఉదయానికి 27 వేల పైచిలుకు కమీషన్ దుకాణాలకు చేరాయి. ఎండ తీవ్రత తగ్గకపోయినా గతంలో ప్రకటించిన విధంగా సోమవారం ఉదయం 7 గంటలకు విక్రయాలను దిగుమతి వ్యాపారులు ప్రారంభించారు. రైతుల సమక్షంలో శాంపిల్స్‌ని షాపుల్లో ప్రదర్శించారు. ఎగుమతిదారులు వేలం కేంద్రాలను సందర్శించి కొనుగోళ్లు చేపట్టారు. ప్రధానంగా తేజ, 341 వెరైటీలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు. తొలి రోజు అయినా 23 వేల టిక్కీల వరకు విక్రయాలు జరిగాయి. మిర్చి వెరైటీని బట్టి రూ.9500 నుంచి రూ.14 వేల వరకు ధర లభించింది. విదేశాలకు ఎగుమతి జరిగే తేజకు క్వింటా ధర రూ.14 వేల 700 వరకు లభించింది. మిర్చి తాలు కాయలకు రూ.4,500 నుంచి రూ.7 వేల వరకు ధర లభించింది. ఈ వారం అంతా కాస్త మందకొడిగానే కొనుగోళ్లు జరుగుతాయని, వచ్చే వారం నుంచి పెరిగే అవకాశం ఉంటుందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.



మిర్చియార్డులో ప్రారంభమైన మిర్చి కొనుగోళ్లు

షైనింగ్.. స్టార్స్‌గా ఎదగాలి

ప్రతిభ అవార్డుల ప్రధానోత్సవ సభలో కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు(విద్య), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అవకాశాలను అందిపుచ్చుకుని, ఎంపిక చేసుకున్న రంగంలో రాణించి షైనింగ్ స్టార్స్‌గా ఎదగాలని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. సోమవారం పొన్నూరు రోడ్డులోని టీ కన్వెన్షన్ హాల్లో సోమవారం ప్రతిభా అవార్డుల ప్రధానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహిస్తూ మిగిలిన విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపడమే షైనింగ్‌స్టార్ అవార్డుల లక్ష్యమన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల బోధన, మార్గనిర్దేశంతో పది, ఇంటర్లో మెరుగైన ఫలితాలు సాధించారని, ఇదే స్ఫూర్తితో ఉన్నత తరగతుల్లో రాణించాలన్నారు. తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ మాట్లాడుతూ వినూత్న ఆలోచనలు, నైపుణ్యాలు, పరిశోధనలతో మెరుగైన ఫలితాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీల, డీఈవో రేణుక, పరీక్షల విభాగం డైరెక్టర్ వెంకటరెడ్డి ఇంటర్ బోర్డు ఆర్‌ఐవో జీకే జుబేర్, ఉర్దూ డీఐ ఖాసీం, కామన్ ఎగ్జామినేషన్ బోర్డు చైర్మన్ తిరుమలేష్, ఎంఈవోలు కుద్దూస్, నాగేంద్రమ్మ పాల్గొన్నారు.



అవార్డులు పొందిన విద్యార్థులతో కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్యే నసీర్ తదితరులు

ముంచుకొస్తోంది !

(5వ పేజీ తరువాయి)

మరమ్మతు పనుల్లో మాత్రం వేగం నీరసించిపోయింది. సాగునీటి సంఘాలు ఉత్సాహంగా ఉన్నచోట పనులు జరిగిపోతుంటే, కొందరు చేద్దాంలే అన్నట్లు కాడి కింద పడేస్తున్నారు. దీనికి కారణం... నిధులు విడుదల అవుతాయా! లేదా! అనేది ఒక అనుమానం అయితే, గత ప్రభుత్వ కాలంలో పనులు చేసిన వారికి నేటికీ ఆ మొత్తాలు విడుదల కాకపోవడమే.

సకాలంలో 746 పనులూ పూర్తయ్యేనా!

సాగునీటి కాల్వలపై ప్రధానంగా స్లూయిజ్‌లు, షట్టర్ల నిర్మాణ పనులు, గుర్రపు డెక్క, తూటుకాడ తొలగింపు, కాల్వ కట్టలపై జంగిల్ క్లియరెన్స్, కట్టలు బలపరచడం, గండ్లు పడే పరిసితి ఉన్నచోట వాటిని పూడ్చటం వంటి పనులు చేయాల్సి ఉంది. మొత్తం 746 పనులను అధికారులు గుర్తించారు. వీటిలో కొన్ని పెద్ద పనులకు టెండర్‌లు పిలిస్తే, మిగిలినవి సమయాబావంతో నామినేషన్‌పై సాగునీటి సంఘాలతోనే చేయిస్తున్నారు. ఐతే జూలై మొదటి వారంలోనే డెల్టా కాల్వలకు 2025-26 ఖరీఫ్ సీజన్‌కు గాను నీటిని విడుదల చేయాల్సి ఉంది. కాల్వల పనుల్లో వేగం కనిపిస్తున్నా, డ్రెయిన్‌ల మరమ్మతులు, పూడికతీత పనుల్లో మాత్రం తీవ్ర జాప్యం కనిపిస్తోంది. రూ. 25 కోట్లలో రూ. 4.8 కోట్ల నిధులు స్లూయిజ్‌లు, షట్టర్‌ల మరమ్మతులకు కేటాయించారు. వీటిలో స్లూయిజ్‌ల నిర్మాణమే రూ. 3 కోట్లతో చేపట్టారు. మంగళగిరి దగ్గర్లోని చినపాలెం, బాపట్ల, తెనాలి, వరహాపురం ప్రాంతాల్లో బ్యాంక్ కెనాల్, మెయిన్ కెనాల్, తూర్పు, పశ్చిమ కాల్వలపై వీటిని చేపట్టారు. ఇవన్నీ కాంక్రీట్‌వి కావడంతో వాటిని మాత్రం వేగవంతం చేశారు. షట్టర్లు బయట తయారు చేయించి తీసుకొచ్చి బిగించడంతో వాటికీ ఇబ్బది లేకుండా ఉంది. అయితే తూటుకాడ తొలగింపు, కట్టలకు పడిన కోత, గండ్లు పడేలా బలహీనపడిన కట్టల పనుల్లో మాత్రం కాస్తంత వెనకడుగు కనిపిస్తోంది. మట్టి కొరతతో పనులు కాస్తంత మందకొడిగానే సాగుతున్నాయి. మరోపక్క డ్రెయిన్‌లలో పూడిక తొలగింపు ప్రక్రియ వేగమందుకోలేదు. గత దశాబ్ద కాలంలో కొన్ని డ్రెయిన్‌లకు మాత్రమే మరమ్మతులు పూర్తిచేశారు. ప్రధానంగా తుంగభద్ర, మరికొన్నిటిపై, కొమ్మమూరు ప్రధాన కాల్వపై బాపట్ల ప్రాంతంలో గతంలోనే గండ్లు పడటంతో వాటిని అప్పట్లో సరిచేశారు. ఇప్పుడు మాత్రం పూడికతీత పనులు ఎక్కువ భాగం చేయాల్సి ఉంది. వీటిని కూడా వేగవంతం చేస్తే వర్షాలు పడిన సమయంలో పంటలకు ముంపు సమస్య లేకుండా రైతులు కష్టపడి పండించిన పంట చేతికందుతుంది.

నాడు నిధులు లేక అవస్థలు.. నేడు ఉపశమనం

గత వైసీపీ ప్రభుత్వంలో అత్యవసర మరమ్మత్తు పనులు అవసరం ఉన్నా నిధులు మంజూరు చేసింది లేదు. దీంతో కాల్వలన్నీ గండ్లుపడేలా, చుక్క నీరు కిందికి వెళ్లడానికి అవకాశం లేని విధంగా పూడిపోయి ఉన్నాయి. అప్పట్లో నిధులు మంజూరు చేశామనిపించేలా విదిలింపుల తరహాలో చాలీచాలని నిధులు ఇచ్చామనిపించి, వాటిలో సింహభాగం నేతల మేతకే సరిపెట్టేవారు. దీంతో పనులు జరగక, కాల్వల చివరి భూములకు నీరు అందక బీడుపెట్టిన పరిస్థితి కూడా ఉంది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ సాగు నీటి సంఘాలను రంగంలోకి దింపింది. నిధులు విడుదలలో ఎటువంటి జాప్యం ఉండదని కూడా తేల్చిచెప్పింది.

నెలాఖరు లోపే పూర్తి చేస్తాం

-వెంకటరత్నం, ఇన్‌చార్జి ఎస్ఈ, కృష్ణా పశ్చిమ డెల్టా విభాగం, గుంటూరు

కృష్ణా పశ్చిమ డెల్టా కాల్వల పనులు సకాలంలోనే పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం. సాగునీటి సంఘాలు కూడా సహకరిస్తున్నాయి. ఈ నెలాఖరులోపు ప్రధాన మరమ్మతులు పూర్తి చేయాలని సూచించాం. స్లూయిజ్‌లు, షట్టర్ల వంటి ప్రధాన పనులు చివరి దశకు చేరాయి. మొత్తమ్మీద 60 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ 20 రోజుల్లో మిగిలిన వాటినికూడా పూర్తిచేస్తాం.వీటివెంటే డ్రెయిన్‌ల మరమ్మతులూ అయిపోతాయి.

డ్రెయినేజీనే ఆక్రమించేశాడయ్యా...

- మా పడవలు సముద్రంలోకి వెళ్లేదెలా..



బాపట్ల మండలంలోని అడవిపల్లెపాలెం వద్ద ఈపూరుపాలెం స్టయిట్ కట్ డ్రైన్ పూడ్చి వేస్తున్న దృశ్యం

బాపట్ల, జూన్ 9(ఆంధ్రజ్యోతి): సముద్రంలోకి పడవలు తీసుకెళ్లే డ్రెయినేజీని పూడ్చేసి, నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని తీర ప్రాంత గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. డ్రెయినేజీల నుండి సముద్రంలోకి పడవలు వెళ్లడానికి ఆటంకం ఏర్పడిందంటూ మత్స్యకారులు సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే బాపట్ల మండలం అడవి గ్రామ పంచాయతీ పరిధిలోని అడవిపల్లెపాలెం, కృపానగర్, దాన్వాయ్‌పేట, గాదె వెంకటరెడ్డి కాలనీ, రామాపురం, కనకదుర్గా నగర్, చీరాల మండలం వాడరేవు పంచాయతీలోని వాడరేవు ప్రాంతాల్లోని మత్స్యకారులు చేపల వేటకు వినియోగించే బోట్‌లను ఈపూరుపాలెం స్ట్రయిట్ కట్ డ్రెయిన్‌లో నిలుపుతారు. బోట్‌ల మరమ్మతులకు కూడా ఆప్రాంతం అనుకూలంగా ఉంటుంది. ఏడాది నుంచి ఆప్రాంతంలో ఆక్వా చెరువుల రైతు వెంకట్రావు కన్ను డ్రెయినేజీపై పడింది. ఒంపుగా ఉన్న డ్రెయిన్‌ను స్ట్రయిట్‌గా చేస్తానంటూ ఓ వైపు మొత్తం రాళ్లు, మట్టితో పూడ్చి సుమారు 7 ఎకరాలు ఆక్రమించాడు. పక్కనే రిసార్ట్‌లు కట్టాడని మత్స్యకారులు ఆరోపించారు. ఈవిధంగా డ్రెయినేజీని కబ్జా చేయడం వల్ల కాల్వ ద్వారా సముద్రంలోకి పడవలు వెళ్లడానికి వెడల్పు చాలదంటూ ఏడు గ్రామాలకు చెందిన 2 వేల బోట్‌లలో చేపల వేట చేసే మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమిత ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్న సదరు వ్యక్తిపై చర్యలు తీసుకొని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు ఎరిపిల్లి రమణ, పిక్కి డేవిడ్, పిక్కి సూరిరావు, దోనే శ్రీను, సిరిపిల్లి జగ్గారావు, చొక్కా రాంబాబు, చోడిపిల్లియాకోబు, దోనే కనకారావు ఉన్నారు.



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న అడవిపల్లెపాలెం, కృపానగర్, దాన్వాయ్‌పేట, గాదె వెంకటరెడ్డి కాలనీ తదితర గ్రామాలకు చెందిన మత్స్యకారులు

అనుమానపు అగ్ని కాల్చేసింది

- భార్యపై పెట్రోల్ పోసి నిప్పంటించిన భర్త

బాపట్లరూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానం పెంచుకున్న భర్త.. ఆమెపై ఇంటిలోనే పెట్రోల్ పోసి నిప్పటించాడు. ఇద్దరు చిన్న పిల్లలు తల్లి లేని అనాథలవుతారన్న కనికరం కూడా లేకుండా తలుపులు వేసి అక్కడి నుంచి పారిపోయాడు. ఈ విషాద ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు... బాపట్ల మండలం చెరువుజమ్ములపాలెం ఎస్సీ కాలనీకి చెందిన డీ సుభాషిణి (25)ని అదే గ్రామానికి చెందిన దోసరి హరీష్ 2014లో పెళ్లి చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో అతను కొంతకాలం నుండి భార్య మీద అనుమానం పెంచుకున్నాడు... వారి మధ్య అప్పుడప్పుడు గొడవలు జరుగుతుండేవి. మధ్యాహ్నం గ్రామ సమీపంలోని పెట్రోల్ బంకులో హరీష్ రెండు లీటర్ల పెట్రోల్ కొనుగోలు చేసి, ఇంట్లో ఉన్న భార్య సుభాషిణిపై పోసి నిప్పు అంటించాడు. తలుపులు వేసి అక్కడి నుంచి పారిపోయాడు. అటుగా వెళ్తున్న గ్రామస్థులు సుభాషిణి కేకలు విని, ఆమెను బయటకు తీసుకొచ్చి మంటలు ఆర్పారు. వెంటనే బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. అప్పటికే 80 శాతం వరకు సుభాషిణి శరీరం కాలిపోయిందని వైద్యులు నిర్ధారించి, మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో ఆమె మృతి చెందింది. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలికి ఇద్దరు చిన్న పిల్లలు ఉండటంతో కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు. హరీష్‌పై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బాపట్ల రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపడుతున్నారు.



డీ సుభాషిణి (ఫైల్‌ఫొటో)

రేషన్ మాఫియా.. బరితెగింపు

(5వ పేజీ తరువాయి)

సభ్యులు ఇంతలా బరితెగించి చెలరేగిపోతున్నా, పత్రికల్లో పుంఖానుపుంఖాలుగా కథనాలు వస్తున్నా పౌర సరఫరాల అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

అక్రమాలకు కొన్ని ఉదాహరణలు..

- గుంటూరు సాయికృష్ణనగర్‌లోని డీలర్ రాజీనామాతో డాన్ అధికారులతో మాట్లాడి ఆ షాపునకు డానియేలు అనే అతణ్ణి ఇన్‌చార్జిగా నియమించేలా చేసుకుని వ్యవహారాన్ని నడిపిస్తున్నాడు.
- ❑ గుంటూరు -1 పరిధిలో ఉన్న షాపునకు సంబంధించిన ఈ-పోస్ యంత్రాన్ని తెచ్చి గుంటూరు-2 పరిధిలో వేలిముద్రలు వేయించుకుంటున్నారు.
- ❑ భరత్‌పేటలో గుంటూరు-వన్‌కు చెందిన మాఫియా అనుచరులు వేలిముద్రల తతంగాన్ని బహిరంగంగానే నడిపిస్తున్నారు.

వైసీపీ నాయకుడే.. ఇన్‌చార్జి డీలర్

దుకాణం నల్లచెరువులో.. వేలిముద్రలు పలకలూరు రోడ్డులో

గుంటూరు: కూటమి ప్రభుత్వంలో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తల సంగతేమోగాని వైసీపీ శ్రేణులకు మాత్రం అన్ని పనులు జరిగిపోతున్నాయి. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలోనే కాకుండా ప్రభుత్వం మారిన తర్వాత కూడా కూటమిపై బహిరంగంగా విమర్శలు, నిరసనలు చేపట్టిన వారికి ఏకంగా ఇన్చార్జి డీలర్‌షిప్ కట్టబెట్టారు. గుంటూరులోని పలకలూరురోడ్డు కృష్ణబాబుకాలనీకి చెందిన వైసీపీ నాయకుడికి గతంలో ఎండీయూ వాహనాన్ని కేటాయించారు. అతడు వాహనాల ఆపరేటర్ల నుంచి పెద్దమొత్తంలో బియ్యాన్ని కొనుగోలు చేసి లక్షలు పోగేసుకున్నాడనేది బహిరంగ రహస్యం. ఎండీయూ వాహనాల రద్దును వ్యతిరేకిస్తూ గత నెల 23న స్తంభాలగరువు సెంటర్లో ధర్నా, రాస్తారోకో చేశాడు. నల్లచెరువులోని 145 నెంబరు డీలర్ రాజీనామాతో అక్కడ ఇన్‌చార్జిగా పలకలూరురోడ్డు ప్రాంతానికి చెందిన వైసీపీ నాయకుడ్ని నియమించారు. అతడు అక్కడ సరుకులు పంపిణీ చేయకుండా బియ్యానికి నగదు పంపిణీ చేస్తున్నాడు. ఆ బియ్యాన్ని మాఫియా డాన్‌కు తరలిస్తున్నాడు. ఎక్కడో నల్లచెరువు ప్రాంతానికి చెందిన ఈ-పోస్ యంత్రంతో పలకలూరు రోడ్డులోని కార్డుదారులతో వేలిముద్రలు వేయిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారని పలువురు విమర్శిస్తున్నారు. కార్డుదారులు ఎక్కడైనా రేషన్ తీసుకునే సౌలభ్యం ప్రభుత్వం కల్పించగా దాని ఆధారంగా అక్రమ దందాను కొనసాగిస్తున్నట్లు తోటి డీలర్లు వాపోతున్నారు.

స్కూటీని ఢీకొన్న లారీ.. మహిళ మృతి

మేడికొండూరు జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ముందు వెళ్తున్న స్కూటీని వేగంగా లారీ ఢీకొట్టడంతో.. మహిళ అక్కడికక్కడే దుర్మరణం చెందింది. స్కూటీ నడుపుతున్న వ్యక్తికి గాయాలు అయ్యాయి. పేరేచర్ల సమీపంలో నల్లపాడు శ్రీనివాస్ నగర్ కాలనీ వద్ద సోమవారం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వివరాల మేరకు.. గుంటూరు నగరం స్తంభాలగరువుకు చెందిన చల్లా సాంబిరెడ్డి తన ఇంటి సమీపంలోని కోటేశ్వరమ్మ(55) అనే మహిళతో కలసి కైలాసగిరి క్షేత్రానికి వెళ్లి దైవదర్శనం అనంతరం తిరిగి వస్తున్నాడు. శ్రీనివాస నగర్ కాలనీ వద్ద వెనకనుంచి లారీ వీరు ప్రయాణిస్తున్న స్కూటీని ఢీకొంది. వెనకవైపు కూర్చుని ఉన్న కోటేశ్వరమ్మ లారీ టైర్ల కింద పడి అక్కడికక్కడే మరణించింది. స్కూటీ నడుపుతున్న సాంబిరెడ్డికి స్వల్ప గాయాలు అయ్యాయి. నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన స్థలం గుంటూరు, మేడికొండూరు మండలాల సరిహద్దు కావడంతో ముందుగా అక్కడకు చేరుకున్న మేడికొండూరు పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్దీకరించారు.

వ్యవసాయ, ఖజానా శాఖల్లో బదిలీలు

గుంటూరు సిటీ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ జోన్-3 పరిధిలోని 23 మంది సూపరింటెండెంట్‌లు, సీనియర్ అసిస్టెంట్‌లను బదిలీ చేస్తూ కమిషనర్ ఢిల్లీరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన వారు ఉన్నారు. నెల్లూరు జిల్లాలో పని చేస్తున్న అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సీహెచ్ రోజామణిని గుంటూరుకు.. గుంటూరు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎన్‌వీ ప్రసాద్‌ను నెల్లూరుకు బదిలీ చేశారు.

ఖజానా శాఖలో..

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ఖజానా శాఖలో బదిలీల సందడి నెలకొంది. 67 మంది ఉద్యోగులు బదిలీ అయ్యారు. వీరిలో సీనియర్ అకౌంటెంట్లు, జూనియర్ అసిస్టెంట్‌లు, గ్రూప్-4, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. ఇదిలా ఉంటే నిబంధనల ప్రకారం 9 ఏళ్ల స్టేషన్ సర్వీస్ పూర్తి కానప్పటికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషాను కూడా బదిలీ చేయడం చర్చ నీయాంశంగా మారింది.

అనుమానాస్పద స్థితిలో యాచకుడి మృతి



తెనాలి, మారీసుపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక మారీసుపేట లోయర్ వార్ఫ్‌లో సోమవారం తెల్లవారుజామున అనుమానాస్పద స్థితిలో యాచకుడు మృతి చెందాడు. అతనిది హత్య లేక ఆత్మహత్య అనే సందేహాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. త్రీటౌన్ ఎస్సై షేక్ కరిముల్లా కథనం మేరకు.. పట్టణంలో యాచక వృత్తి చేసుకుంటు జీవించే వృద్ధుడు (65) సోమవారం తెల్లవారుజామున మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గమనించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మెడకు కండువా ముడిపెట్టి ఉన్న వృద్ధుడి మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలోని మార్చురికి తరలించారు. యాచకుడి మృతిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ ఎస్సై కరిముల్లా తెలిపారు.

క్వాలిటీ కుట్ర..

(5వ పేజీ తరువాయి)

రూ.8,500 ధర ఇవ్వడానికి కూడా సుముఖత చూపని కంపెనీలు ఇప్పుడు రూ.10,000 ఇస్తామని క్వాలిటీ పొగాకు మొత్తాన్ని లాగేసే పనిలో ఉన్నట్లు సమాచారం. మార్క్‌ఫెడ్ పూర్తి స్థాయిలో రంగంలోకి దిగడానికి రెండు మూడు రోజులు సమయం పట్టే అవకాశం ఉండడంతో ఈలోపులోనే క్వాలిటీ బర్లీని మొత్తం తమ హస్తగతం చేసుకునేలా కంపెనీలు పావులు కదుపుతున్నాయి. అంతర్జాతీయంగా పొగాకు మార్కెట్ తీవ్ర ఒడిదుడుకుల్లో ఉందని చెబుతూ వస్తున్న కంపెనీలు మార్క్‌ఫెడ్ ప్రకటన రాగానే క్వాలిటీ పొగాకు కోసం గ్రామాల్లో జల్లెడ పట్టడాన్ని రైతులు తప్పుబడుతున్నారు. క్వాలిటీలో అయితే లాభాలు గడించే అవకాశం ఉండడంతో లోగ్రేడ్ రకాలను పూర్తిగా విస్మరించి వారి ప్రయోజనాలే పరమావధిగా కంపెనీల అడుగులు ఉండడంపై రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు రూ.12,000 వరకు క్వాలిటీ పొగాకుకు మార్క్‌ఫెడ్ ధర ఇవ్వనున్నట్లు సమాచారం. ఈ ఆశతోనే రైతులు తాము మార్క్‌ఫెడ్‌కే అమ్ముకుంటామని ఏజెంట్లకు తెగేసి చెబుతున్నట్లు సమాచారం. బాపట్ల జిల్లాలో 3 లక్షలు, పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో దాదాపు 1.60 లక్షల క్వింటాళ్ల వరకు బర్లీ పొగాకు ఉన్నట్లు అధికారులు తేల్చారు. ఇందులో దాదాపు 50 శాతం క్వాలిటీ గ్రేడ్ రకం కాగా మిగిలినది మీడియం, లో క్వాలిటీగా ఉంది.

గృహనిర్మాణ సంస్థలో పది మంది డీఈఈలకు ఉద్యోగోన్నతులు

అమరావతి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థలో పది మంది డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు ఉద్యోగోన్నతులు లభించాయి. వారికి అందుబాటులో ఉన్న ఖాళీల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పోస్టింగులు ఇస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉద్యోగోన్నతులు పొందినవారిలో జి.పిచ్చయ్య (కందుకూరు డివిజన్, నెల్లూరు జిల్లా), పి.వెంకటరావు (మార్కాపురం డివిజన్, ప్రకాశం జిల్లా), కె.రమేష్‌రెడ్డి (మదనపల్లి డివిజన్, అన్నమయ్య జిల్లా), ఎన్.సుబ్రహ్మణ్యం (ప్రొద్దుటూరు డివిజన్, (కడప జిల్లా), వై.లక్ష్మీనారాయణమ్మ (ధర్మవరం డివిజన్, శ్రీ సత్యసాయి జిల్లా), బి.వెంకటరమణ (పెనుగొండ డివిజన్, సత్యసాయి జిల్లా), కె.సూరిబాబు (టెక్కలి డివిజన్, శ్రీకాకుళం జిల్లా), ఎం.రామోజీ నాయక్ (శ్రీకాకుళం డివిజన్, (పార్వతీపురం మన్యం జిల్లా), కె.చంద్రశేఖర్ (పాలకొండ డివిజన్, పార్వతీపురం మన్యం జిల్లా), కె.వి.వి.ఎస్.ప్రసాద్ (జంగారెడ్డిగూడెం డివిజన్, ఏలూరు జిల్లా) ఉన్నారు.

వ్యర్థాల నిర్వహణ నివేదిక సిద్ధం చేయాలి

జిందాల్ ప్లాంట్‌పరిశీలనలో పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి



జిందాల్ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరి సురేష్ కుమార్, సీడీఎం సంపత్ కుమార్

గుంటూరు కార్పొరేషన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): సీఎం పర్యటన నేపథ్యంలో ప్లాంట్ కెపాసిటీ, వస్తున్న వ్యర్థాలు, పంపుతున్న మునిసిపాలిటీలు, రోజువారీ విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, వ్యర్థాల నిర్వహణ వంటి సమగ్ర వివరాలతో నివేదిక సిద్ధం చేయాలని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి ప్రిన్సిపల్ సెక్రటరి సురేష్‌కుమార్ చెప్పారు. గుంటూరు సమీపంలోని నాయుడుపేట వద్ద గల జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ని ఆయన సోమవారం సందర్శించారు. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ పరిశీలనకు రానున్న తరుణంలో సీడీఎంఏ డాక్టర్ సంపత్ కుమార్, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులతో కలిసి ప్లాంట్‌ని పరిశీలించారు. ప్లాంట్ సామర్థ్యం, పనితీరు, చెత్త సేకరణ, విద్యుత్ ఉత్పత్తి తదితర వివరాలను జిందాల్ ఏపీ ప్రాజెక్ట్ ప్రెసిడెంట్ ఎంవీ చారి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అలాగే జీఎంసీ నుండి చేపట్టాల్సిన పారిశుధ్య పనులకు పిన్ పాయింట్‌గా సిబ్బందిని కేటాయించాలని కమిషనర్‌ని ఆదేశించారు. అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, ఉపా సెల్ పీఓ రామారావు పాల్గొన్నారు.

కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శిగా శ్రీనివాస్‌కు ఉద్యోగోన్నతి



గుంటూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ లీగల్ సర్వీస్ అధికారి రామి శెట్టి శ్రీనివాస్‌కు కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖలో అదనపు కార్యదర్శిగా ఉద్యోగో న్నతి లభించింది. ఈ మేరకు కేబినెట్ అపాయింట్‌మెంట్స్ కమిటీ అధికారికంగా జారీ చేసిన ఉత్తర్వులు ఆయనకు సోమవారం అందాయి. ఈ నియామకానికి సంబంధించిన గజిట్ నోటిఫికేషన్‌ని కూడా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. రామిశెట్టి శ్రీనివాస్ యూపీఎస్సీ ద్వారా ఇండియన్ లీగల్ సర్వీస్‌కు ఎంపికై విధులు నిర్వహిస్తున్నారు. జాయింట్ సెక్రెటరీ హోదాలో ఆయన నూతన చట్టాల రూపకల్పనలో కీలకపాత్ర పోషించారు. జీఎస్‌టీ, రియల్ ఎస్టేట్ రెగ్యులేషన్ యాక్టు, పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్, సరోగసి బిల్లు, పలు రాజ్యాంగ సవరణల్లో క్రియాశీలకంగా వ్యవహరించారు. ఆయన గుంటూరు జిల్లాలో పుట్టారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో విద్యాభ్యాసం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా అంకారావు

కారంపూడి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో సలహాదారుడిని నియమించింది. కారంపూడి పట్టణానికి చెందిన కొమెర అంకారావు అలియాస్ జాజిని అడవుల పెంపకం సలహాదారునిగా నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. నల్లమల అడవిలో ప్లాస్టిక్ ఏరివేత ఒక యజ్ఞంలా నిర్వహించిన చరిత్ర జాజికి ఉంది. ఇటీవల పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వన మహోత్సవం కార్యక్రమంలో సీఎం చంద్రబాబు అంకారావును ప్రభుత్వ సలహాదారునిగా నియమిస్తున్నట్లు ప్రకటన చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	116, 124, 135
చికెన్ విత్ స్కిన్(కిలో)	220.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	230.00

22,873 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 27,034 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 22,873 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 4161 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	9500	13500	334	9500	14000
నెంబరు. 5	10000	12500	నెంబరు. 5	10000	13500
273	10000	12500	273	---	---
341	10000	13500	341	10000	14500
4884	–	–	4884	--	--
సూపర్ 10	10000	12500	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14000	తేజ	10000	14700
బ్యాడిగి	10000	13000	బ్యాడిగి	10000	13500
దేవనూరు డీలక్స్	10000	12500	దేవనూరు డీలక్స్	10000	13800
ఆర్మూరు	9800	11200	తెల్లకాయలు	4500	7000


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

అర్జీల శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరం లో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీల శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కమిష నర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పీజీఆర్ ఎస్ నిర్వహించారు. పీజీఆర్ఎస్‌లో మేయర్ కూడా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కమిషనర్ తొలుత డయల్‌యువర్ కమిషనర్ ద్వా రా ప్రజల నుంచి అందిన 20 ఫిర్యాదులు అందుకున్నారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్‌కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు తీసుకొని కమి షనర్ అధికారులతో మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలని, ఆయా అర్జీలను ర్యాండ మ్‌గా క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తామన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా 29 ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ బి.శ్రీని వాసరావు, విభాగాధిపతులు, మేనేజర్ బాలజి బాషా పాల్గొన్నారు.

మాన్యువల్ కౌన్సెలింగ్ అనుమతించే వరకు ఉద్యమిస్తాం

● ఐక్యవేదిక నాయకులు

గుంటూరు (విద్య) జూన్ 9 (ఆంధ్ర జ్యోతి): ఉపాధ్యాయుల మనోభావాలను గౌరవించి మాన్యువల్ కౌన్సెలింగ్ ఒప్పుకునే వరకు ఉద్యమాలు చేస్తామని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు స్పష్టం చేశారు. సోమవారం ఎస్జీటీలకు నిర్వహించే వెబ్ కౌన్సెలింగ్‌కు నిరసనగా కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు ప్రారంభించారు. ప్రభుత్వం స్పందించకుంటే సీఎస్‌సీ కార్యాలయం, విద్యాభవన్‌ను ముట్టడిస్తామని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా స్టీరింగ్ కమిటీ నాయకుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని హామీ ఇచ్చిన విద్యాశాఖాధికారులు మోసపూరితంగా వెబ్ ఆప్షన్స్‌కి ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయడం శోచనీయమన్నారు. విద్యాశాఖామంత్రి లోకేశ్ మాన్యువల్ కౌన్సెలింగ్‌కి చట్టం అడ్డం వస్తుందని చెప్పడం ఉపాధ్యాయులను మోసం చేయడమేనన్నారు. కార్యక్రమంలో ఐక్య ఉపాధ్యాయ వేదిక నాయకులు ఎం.కళాధర్ బాబు తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించకుంటే విద్యా భవన్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

దీక్షా శిబిరాన్ని సీనియర్ మహిళా నాయకురాలు కుసుకుమారి ప్రారంభించారు. శిబిరంలో ఐక్యవేదిక నాయకులు హనుమంతరావు, రామ చంద్రయ్య మహమ్మద్ ఖాలీద్, సుబ్బారెడ్డి, వినయ్, సంపత్, షకీలా బేగం, దాస్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద దీక్షలు చేస్తున్న ఉపాధ్యాయులు.

ఏసీ కళాశాల విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు

గుంటూరు (విద్య), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో హెచ్ఈసీ గ్రూపు నందు ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు షైనింగ్ స్టార్ అవార్డులు అందుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కొమ్మాలపాటి మో జస్ సోమవారం ఒకరంలో తెలిపారు తమ విద్యార్థులు గోరంట్ల లిఖిత్, షేక్ ఫారూఖ్ అబ్దుల్లా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభా పురస్కారాలకు ఎంపికయ్యారని వెల్లడించారు. కలెక్టర్ చేతుల మీదుగా స్వీకరించారన్నారు. వీరికి 20వేల నగదు, మెడల్, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. విద్యార్థులను లా కళాశాల ప్రిన్సిపాల్ గురవయ్య, అధ్యాపకులు ఎం.సిరిల్‌కుమార్, ఎం.జాన్ న్యూటన్, పి.రాజేష్‌లు తదితరులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కొమ్మాలపాటి మోజస్ తదితరులు

కౌలు రైతుకు అన్నదాత సుఖీభవ వర్తింపచేయాలి

● సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు

గుంటూరు(తూర్పు), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రతి కౌలు రైతుకు వర్తింప చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు కోరారు. గుంటూరు, బ్రాడీపేట సీపీఎం కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూయజమాని సంతకం తొలగించి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చేందుకు కొత్త చట్టం తీసుకువస్తామని అసెంబ్లీ సాక్షిగా వ్యవసాయశాఖ మంత్రి ఇచ్చిన హామీ అమలు కావడం లేదన్నారు. ఖరీఫ్ ప్రారంభమై యజమానితో ఒప్పందాలు జరుగుతున్నా ఈ చట్టం అమల్లోకి రాలేదని అన్నారు. తక్షణమే కౌలు చట్టాన్ని మార్చి గ్రామసభల ఆధారంగా రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. రైతుల సమస్యలపై ఈ నెల 11న జరిగే చలో మంగళగిరి కార్యక్రమంలో సీసీ ఎల్ఏ, వ్యవసాయ శాఖ కమిషనర్లకు వినతిపత్రాలు అందజేస్తామని అన్నారు. సమావేశంలో కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ, బీ.రామకృష్ణ, పాశం రామారావు, ఈమని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కేవీ నూతన ప్రిన్సిపాల్‌గా బొంతా శేఖర్


బాధ్యతలు స్వీకరిస్తున్న బొంత శేఖర్

గుంటూరు (విద్య), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కేంద్రీయ విద్యాలయం (నల్లపాడు) నూతన ప్రిన్సిపాల్‌గా బొంతా శేఖర్ సోమవారం బాధ్య తలు స్వీకరించారు. శేఖర్ 1993 సెప్టెంబరు 7న కేంద్రీయ విద్యాలయలో ఉపాధ్యాయుడి గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం 2009లో ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొంది అస్సాం, సూర్యలంక, ఒంగోలు, కాకినాడ తదితర ప్రాంతాల్లో 16సంవత్సరాలుగా విధులు నిర్వహించారు. తాజాగా జరిగిన బదిలీల్లో నల్లపాడులోని కేంద్రీయ విద్యాలయంలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు. పీఎం శ్రీకేంద్రీయ విద్యాలయంగా మారిన విద్యాలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని, విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సహకారంతో మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేస్తానని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన జీవీస్టీ కమిషనర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పాఠశాల హెచ్‌ఎం ఎస్ ఆనంద్ తదితరులు నూతన ప్రిన్సిపాల్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

అర్జీలను నిర్ణీత గడువులో పరిష్కరించాలి

● జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ
● ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 178 అర్జీలు
● పరిష్కరించాలంటూ ఆదేశాలు

గుంటూరు(తూర్పు), జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, వాటిని త్వరగా పరిష్కరించాలని అధికారులను జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్‌తేజ ఆదేశించారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి 178 అర్జీలు వచ్చాయి. డీఆర్వో షేక్ ఖాజావలీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం గంగరాజు, లక్ష్మీకుమారి, ఆర్డీవో శ్రీనివాసరావుతో కలసి ఆయన అర్జీలను స్వీకరించారు. అనంతరం భార్గవ్‌తేజ మాట్లాడుతూ అర్జీదారుని దరఖాస్తుని రిజిస్టర్‌లో తప్పక నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీవో శేషశ్రీ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ సువార్త, డీపీవో నాగసాయికుమార్, గ్రౌండ్ వాటర్ డీడీ వందనం, ఎల్‌డీఎం మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

● పాక్షిక అంధత్వం ఉన్నవారికి బస్ పాస్ జారీ చేయాలని విజువల్లి ఛాలెంజ్ యూత్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో అంధులు అర్జీ అందజేశారు. 80శాతం ఉన్న ప్పటికి బస్‌పాస్ ఇవ్వడం లేదని వందశాతం ఉంటేనే పరిగణిస్తున్నారని జేసీ దృష్టికి తీసు కువచ్చారు. శారీరక వైకల్యం 40శాతం నమోదైన వారికి కూడా బస్‌పాస్ ఇస్తున్నారని, అంధుల విషయంలో దీనిని పాటించడం లేదని చెప్పారు. బస్సులో అంధులకు కేటాయించిన సీట్లలో వేరే వారిని కూర్చోకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జయరాజ్, రవీంద్ర, శంకర్ ఉన్నారు.

● పదవీ విరమణ తరువాత రావాల్సిన సదుపాయాలు ఇవ్వకుండా వేధిస్తున్నారని బీఎస్ ఎన్ఎల్ ఉద్యోగి నల్లగర్ల నరసింహారావు అర్జీ అందజేశారు. బీఎస్ఎన్ఎల్‌లో గుంటూరు కార్యాలయంలో టెలిఫోన్ మెకానిక్‌గా పనిచేస్తున్నానని నాతో శ్రీహరిరావు అనే వ్యక్తి పని చేశారని చెప్పారు. శ్రీహరిరావు తీసుకున్న రుణానికి హామీగా సంతకం పెట్టానని తెలిపా రు. 2020లో వీఆర్ఎస్ ద్వారా పదవీ విరమణ పొందానని.. కాకపోతే శ్రీహరిరావు తీసుకున్న రుణాన్ని రికవరీ చేయకుండా నా ఖాతాలో ఉన్న పొదుపు మొత్తాన్ని రికవరీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

● వితంతు పెన్షన్ మంజూరు చేయాలని స్థానిక గోరంట్ల, ఒకటో వార్డుకు చెందిన బిందు నరసమ్మ అర్జీ అందజేశారు. రెండేళ్ల క్రితం భర్త చనిపోయారని అప్పటినుంచి తిరుగుతున్న పెన్షన్ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బందిని అడిగితే పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని వాపోయారు.


అర్జీదారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ, డీఆర్వో షేక్ ఖాజావలీ తదితరులు


ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు

యోగాని జీవన విధానంలో భాగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే రామాంజనేయులు

గుంటూరు కార్పొరేషన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): యోగాని ప్రతి ఒక్కరూ జీవనవిధానంలో భాగం చేసుకుంటే మెరుగైన ఆరోగ్యాన్ని పొందడానికి వీలుంటుందని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రక టించిన యోగాంధ్ర 2025లో భాగంగా కలెక్టరేట్ నుంచి నగరంపాలెం 3 బొమ్మల సెంటర్ వరకు యోగాపై అవగాహన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మే 21 నుంచి జూన్ 21 వరకు రాష్ట్రంలో సుమారు కోటి మందికి యోగాని పరిచయం చేయడమే లక్ష్యంగా పలు కార్యక్రమాలు చేపడు తుందన్నారు. విద్యా శాఖ మంత్రి లోకేశ్‌తో చర్చించి ప్రతి స్కూల్లో యోగా టీచర్‌ని నియమించేలా కృషి చేస్తామని తెలిపారు. ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఆరో గ్యమే కీలకమని, ప్రస్తుతం ప్రజలెదుర్కొంటున్న అనేక ఆరోగ్య రుగ్మత లను యోగా ద్వారా తగ్గించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, అదనపు కమిషనర్ చల్లా ఓబు లేసు, డిప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్, వైద్యఆరోగ్యశాఖ అధికా రులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకపత్రాలు అందజేత


అభ్యర్థులకు నియామకపత్రాలను అందజేస్తున్న జేసీ భార్గవ్‌తేజ

గుంటూరు(తూర్పు), జూన్ 9(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జేసీ ఏ.భార్గవ్‌తేజ కారుణ్య నియమ కాలకు సంబంధించి నలుగురికి నియామక ఉత్తర్వులను అందించారు. ఉపాధి, శిక్షణ శాఖ, పశు సంవర్ధక శాఖ, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, పోలీస్‌శాఖల్లో జూనియర్ అసిస్టెంట్లుగా నియమిస్తూ ఉద్యోగ ఉత్తర్వులను అందించారు. ఉద్యోగ బాధ్యతతో పాటు కుటుంబసభ్యుల బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఆర్వో ఖాజావలీ, కలెక్టరేట్ ఏవో పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును పరిరక్షించాలి

గుంటూరు(తూర్పు), జూన్ 9(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కును పరిరక్షించేందుకు చర్య లు తీసుకోవాలని ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు వీ రాధాకృష్ణమూర్తి, బీ లక్ష్మణ రావులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక శంకర్‌విలాస్ సెంటర్లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కూటమి నాయకులు విశాఖ ఉక్కుపై స్పష్టమైన ప్రకటన ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కే.శ్రీనివాసరావు, అరుణ్‌కుమార్, ముత్యాలరావు, సత్య నారాయణ, మేకల రవి పాల్గొన్నారు.

జ్ఞానంతోనే.. దుఃఖం దూరం

గుంటూరు(తూర్పు), జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఉపనిషత్తులు అందించిన జ్ఞానాన్ని పొందగలిగితే దుఃఖం మానవుని దరిచేరదని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్ సెంట్రల్ కమిటీ చైర్మన్ ఎన్ రామచంద్రారెడ్డి తెలిపారు. మానవత ఆధ్వర్యంలో స్థానిక బృందావన్ గార్డెన్స్ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం, అన్నమయ్య కళావేదికపై ఉపనిషత్తులపై ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సృష్టిలో ప్రతిది ఏర్పాటు చేసిన తర్వాతనే భగవంతుడు మనిషిని పుట్టించాడని తెలిపారు. అవయవదాన కమిటీ చైర్మన్ టీ.సుందరరామయ్య మాట్లాడుతూ అవయవ ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమానికి కొమ్మాలపాటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా చైర్మన్ పావులూరి రమేష్, రామానుజులు రెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సీతాకల్యాణం హరికథాగానం

గుంటూరు(తూర్పు), జూన్ 9(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై సోమవారం జరిగిన సీతాకల్యాణం హరికథాగానం ప్రేక్షకులను ఆకట్టుకుంది. తొలుత ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రముఖ హరికథా భాగవతారిణి తిరువళ్ళూరి దివ్యసాయి సీతాకల్యాణాన్ని హరికథాగానం ప్రారం భించారు. వీరికి వయొలిన్‌పై దక్షిణామూర్తి, మృదంగంపై సుబ్బారావు వాయిద్య సహ కారం అందించారు.

వైభవంగా ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

గుంటూరు(తూర్పు), జూన్ 9(ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణానగర్, శ్రీగోదా పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం వారి 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిశాయి. ముగింపు ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామికి సుప్రభాత సేవ, నిత్య పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అర్చక బృందం వేద మంత్రాలతో అత్యంత భక్తి శ్రద్ధలతో సుదర్శన మూల మంత్ర హోమం మహాపూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవార్ల అప్పగింతలు, వసంతోత్సవం, చక్రస్నానం విశేషంగా నిర్వహించారు. శ్రీవారికి తిరుప్పావడసేవ అనంతరం విశేషంగా పాల్గొన్న భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం ధ్వజావరోహణం, గరుడ ప్రసాద వితరణ, ద్వాదశ ప్రదక్షిణాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు సహకరించిన దాతలకు, ధనకుదరం వెంకట సత్యవైభవ్, ధనకుదరం శ్రీనివాసాచార్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అర్బన్ హెల్త్‌సెంటర్‌పై కేంద్ర మంత్రికి ఫిర్యాదు

గుంటూరు సిటీ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): గుంటూరులోని బృందా వన్ గార్డెన్స్ అర్బన్ హెల్త్ సెంటర్‌పై కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలుగునాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మలినేని భాను మూర్తి తెలిపారు. అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్యులు అందుబాటులో ఉండటం లేదని పేర్కొన్నారు. చైతన్య స్ఫూర్తి సామాజిక సేవా సంస్థ ప్రెసిడెంట్ చందు హనుమాయమ్మ తదితరులు ఆస్పత్రిని సందర్శించి రోగుల అభిప్రాయాలు సేకరించారని తెలిపారు. ఆ సందర్భంగా చాలా మంది రోగులు వైద్యులు అందుబాటులో ఉండటం లేదని వెల్లడించిన ట్లు పేర్కొన్నారు. ఆ నేపథ్యంలో అర్బన్ హెల్త్‌సెంటర్ దుస్థితిపై కేంద్ర సహాయ మంత్రి పెమ్మసానికి ఫిర్యాదు చేశామని తెలిపారు. ఆయన కార్యాలయంలోని సిబ్బంది వెంటనే స్పందించి వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అధికారితో మాట్లాడారని వెల్లడించారు.

టపాసులు పేలిన ఘటనలో తీవ్ర గాయాలయ్యాయి

● ఆస్పత్రి బిల్లు చెల్లిస్తే సరిపోదు.. నష్టపరిహారం ఇవ్వండి
● కుటుంబసభ్యులతో ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన బాధితుడు


తండ్రి, మేనత్తతో కాలిన గాయాలతో బాలుడు ఈశ్వర్

గుంటూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ట్రిబుల్ ఎక్స్ అధినేత మాణిక్యవేల్ అంతిమ యాత్ర సందర్భంగా టపాసులు కాల్చే సమయంలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తనకు ఆస్పత్రి బిల్లు చెల్లించడం కాదని నష్టపరిహారం ఇవ్వాలని బాధితుడు, అతని కుటుంబసభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం వారు ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని గుండా రావుపేటకు చెందిన దొంతలూరి ఈశ్వర్ అలియాస్ కోటి(14) ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ట్రిబుల్ ఎక్స్ అధినేత మాణిక్యవేల్ అంతిమ యాత్ర గత మార్చి 14న నిర్వహించారు. యాత్రలో టపాసులు పేల్చేందుకు బాణసంచా దుకాణం నిర్వాహకుడు సాంబయ్య, ట్రిబుల్ ఎక్స్ సిబ్బంది ప్రసాద్ అనే ఇద్దరు గుండారావుపేటకు వచ్చి టపాసులు అందిస్తే కూలీ 500 ఇస్తామని చెప్పి ఈశ్వర్‌ను తీసుకెళ్లారన్నారు. ఈ యాత్ర అమరావతి రోడ్డులో ఉన్న సమయంలో టపాసులు ఉంచిన వాహనంలోని టపాసులపై నిప్పు రవ్వలు పడడంతో వాటికి మంటలు అంటుకుని ఒక్కసారిగా పేలాయి అన్నారు. ఈ ఘటనలో ఈశ్వర్‌కు తీవ్ర గాయాలు కాగా రమేష్ ఆస్పత్రికి తరలించా రన్నారు. అప్పటి నుంచి రెండున్నర నెలలకు పైగా ఈశ్వర్‌కు రమేష్ ఆస్పత్రిలో వైద్యం అందించారన్నారు. ఆస్పత్రి వైద్య ఖర్చులన్నీ ట్రిబుల్ ఎక్స్ సంస్థ వారే భరించారన్నారు. అయితే పూర్తిగా మాట రాలేదని, అదేవిధంగా ఒంటిపై గాయాలు తగ్గకపోగా బొబ్బలు వచ్చాయన్నారు. ఇంకా పూర్తిగా వైద్య సేవలు అందకుండానే ఈనెల 3న హడావిడిగా ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారన్నారు. ఈశ్వర్‌కు పూర్తిగా తగ్గేవరకు వైద్యసేవలు అందించాలని, అంతేగాకుండా తగిన నష్టపరిహారం ఇవ్వాలని తండ్రి లీలారావు డిమాండ్ చేశారు.

పర్మినెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

● మనస్థాపంతో బాధితురాలి ఆత్మహత్యాయత్నం

గుంటూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జీజీహెచ్‌లో తాత్కాలిక ప్రాతిపదికన ఆయాగా పనిచేస్తున్న తన తల్లి కోలాటపు లలితకుమారికి పర్మినెంట్ ఆయా ఉద్యోగం ఇప్పిస్తానని జీజీహెచ్‌లో ఎంఎన్‌వోగా ఉద్యోగం చేస్తున్న వాసిమళ్ళ కమలకుమార్ అనే వ్యక్తి ఎనిమిది లక్షల నగదు, 15 సవర్ల బంగారు ఆభరణాలు తీసుకొని మోసం చేశాడని పాత గుంటూరు శుద్ధపల్లి డొంకకు చెందిన రాజేష్ కుమార్ అనే యువకుడు సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు.

బీఆర్ స్టేడియంలో జిమ్ పరికరాల చోరీ

పాత గుంటూరు పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న బీఆర్ స్టేడియం జిమ్ సెంటర్లోని పరికరాలు చోరీకి గురయ్యాయి. గత ఏప్రిల్ 23న రాత్రి చోరీ జరిగితే ఇంత వరకు పాతగుంటూరు పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని బీఆర్‌స్టేడియం హెల్త్ క్లబ్ కమిటీ కార్యదర్శి, జిమ్ ట్రైనర్ వి.దుర్గాప్రసాద్ ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు.

నిస్వార్థ సేవకు నిదర్శనం.. ఆచార్య ఎన్జీ రంగా

గుంటూరు(తూర్పు), జూన్ 9(ఆంధ్రజ్యోతి): నిస్వార్థ సేవకు నిదర్శ నం ఆచార్య ఎన్జీరంగా అని బీజేపీ సీనియర్ నాయకుడు యడ్లపాటి రఘునాథబాబు కొనియాడారు. ఎన్జీరంగా వర్థంతి సందర్భంగా స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని ఆయన విగ్రహానికి బీజేపీ నాయకులు ఘనం గా నివాళులర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరా వు మాట్లాడుతూ ఎన్జీరంగా ఆలోచనలే వ్యవసాయాభివృద్ధికి పునాది అయ్యిందని అన్నారు. కార్యక్రమంలో ఎడ్లపాటి స్వరూపారాణి, దేసు సత్యనారాయణ, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు

ఉత్తమ కవి ప్రతిభా పురస్కార విజేతగా చల్లా సత్యవతి

గుంటూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఫేస్ బుక్ 'అమరావతి సాహితీ మిత్రులు' గ్రూపులో డాక్టర్ రావి రంగారావు నిరంతరాయంగా నిర్వహిస్తున్న వారం వారం కవితల వర్క్ షాపులలో 2025 'వారం వారం కవితల వర్క్‌షాప్' మే నెలలో ఉత్తమ కవి ప్రతిభా సత్కారానికి పల్నాడుకు చెందిన చల్లా సత్యవతి ఎంపికైనట్లు ఒక ప్రకటనలో తెలిపారు. జూలైలో జరిగే అమరావతి సాహితీ మిత్రులు సభలో సత్కారం జరుగుతుందన్నారు.

చదరంగంతో మేధో వికాసం

గుంటూరు(తూర్పు), జూన్ 9(ఆంధ్రజ్యోతి): చదరంగంతో బాలల్లో మానసిక వికాసం కలుగుతుందని జిల్లా ఇంటాక్ కన్వీనర్ ఎస్‌వీఎస్ లక్ష్మీ నారాయణ భారతీయ విద్యాభవన్స్ కార్యదర్శి పీ రామచంద్రరాజు అన్నారు. భారతీయ విద్యాభవన్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి చెస్ పోటీలను వారు ప్రారంభించి మాట్లాడారు. భవన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ క్రీడలలో జిల్లా వ్యాప్తంగా 150 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారని వివరించారు. అనంతరం విజేతలకు సర్టిఫికెట్స్, బహుమతులు అందజేశా రు. విద్యాభవన్ కోశాధికారి కేతరాజు సుభాష్, ప్రిన్సిపాల్ హేమాంబ, ఆనంద్ చెస్ అకాడమీ నిర్వాహకులు గోపి తదితరులు పాల్గొన్నారు.

వీఏపీతో స్వర్ణాంధ్ర-2047కు శ్రీకారం


● వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

గుంటూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విజన్ యాక్షన్ ప్లాన్ రూపకల్పనతో స్వర్ణాంధ్ర-2047కు శ్రీకారం చుట్టబోతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లను సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం ప్రజాప్రతినిధులు, అధికారులతో మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలకు ఇప్పటివరకు ప్రభుత్వ కార్యాలయం లేదని, ఇప్పుడు విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ల ఏర్పాటుతో ఆ లోటు తీరిందన్నారు. ఎమ్మెల్యేలకు ఇది ఒకమంచి అవకాశమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, తూర్పు ఎమ్మెల్యే నసీర్, సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, డీఆర్వో ఎస్ఎస్‌కే ఖాజావలి, సీపీవో శేషశ్రీ, స్టెప్ జిల్లా అధికారి చంద్రమని, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మి, జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


విజన్ యాక్షన్ ప్లాన్ కార్యాలయాల ప్రారంభోత్సవానికి సంబంధించిన సీఎం నిర్వహించిన వీసీకి హాజరైన కలెక్టర్, డేగల, అధికారులు

విశ్లేషణల పేరుతో మహిళలను కించపరచడం హేయం

● డేగల ప్రభాకర్



గుంటూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిపై రాజధాని ప్రాం తంలో ఉన్న మహిళలపై సమాజం సిగ్గుపడే రీతిలో మహిళలను కించపరు స్తూ మాట్లాడటం సిగ్గుచేటని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొ రేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ అన్నారు. టీడీపీ నగర కార్యాలయంలో సోమ వారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అభివృద్ధి ప్రశాంతత అనే పదాలు నచ్చని వైసీపీ ముఠా, విషప్రచారాలు చేస్తూ తన రాజకీయ పబ్బం గడుపు కుంటుందని ఆరోపించారు. ప్రజలు ఓటు అనే ఆయుధంతో చెంప దెబ్బ కొట్టినా వైసీపీ కి ఇంకా బుద్ధి రాలేదని ఎద్దేవా చేశారు. అవినీతి, అక్రమార్జనతో పవి త్రమైన మీడియా రంగంలో కలుపు మొక్కలా జగన్ మీడియా ఆవిర్భ వించి, అబద్ధాలే పరమావధిగా నీచపు రాతలు రాస్తోందని మండిపడ్డా రు. తన సొంత మీడియా ఛానల్ ద్వారా జరిగిన ఈ దారుణాన్ని ఒక మాజీ ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి ఇప్పటికీ ఖండించకపోవడం, స్త్రీజాతికి క్షమాపణ చెప్పకపోవడం దారుణమన్నారు.

మహిళలను కించపరిచే వ్యాఖ్యలు హేయం

గుంటూరు(తూర్పు), జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిని, మహిళ లను కించపరిచే విధంగా చేసిన వ్యాఖ్యలు హేయమని ఇద్వా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గోళ్లమూడి రాజసుందరం బాబు అన్నారు. స్థానిక అంబేద్కర్ భవన్లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాధ్యతాయుతమైన పాత్రికేయ వృత్తిలో ఉంటూ ఇటువంటి వ్యాఖ్యలు చేయడం బాధాకరమని అన్నారు. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇద్వా మహిళా అధ్యక్షురాలు బడుగు విజయలక్ష్మి మాట్లాడుతూ భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం గాకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో బేతపూడి భారతి, దారా వెంకటరత్నం, సాగరిక, శిరీష తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ కుంభకోణంపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలి

● అక్రమార్కుల నుంచే సొమ్ము రికవరీ చేయాలి

గుంటూరు, జూన్9(ఆంధ్రజ్యోతి): జిల్లా కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకులో జరిగిన అక్రమ రుణాల కుంభకోణంపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఎం ప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీఎస్ రవికుమార్ కోరారు. అసోసియేషన్‌ఆధ్వర్యంలో బ్రాడీపేట రెండో లైన్‌లో ఉన్న ఎన్ టీఆర్ సహకార భవన్ ఎదుట సోమవారం ఉద్యోగులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గుంటూ రు జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో జరిగిన కుంభకోణంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, దోషులను గుర్తించి, అన్యాక్రాంతమైన డబ్బును వారి నుంచే వసూలు చేయాలని డిమాండ్ చేశారు. సహకార బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య చైర్మన్, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ మోసానికి గురైన అమాయక బ్యాంకు ఉద్యోగులపై తలపెట్టిన కఠిన చర్యలు నిలుపుదల చేయాలని, వారిపై వేధింపులు, కక్షసాధింపు చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో సహ కార బ్యాంకు ఉద్యోగుల రాష్ట్ర కార్యదర్శి బాలాజీ ప్రసాద్, సహకార సంఘాల ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం హనుమంతరావు, నగర అధ్య క్షుడు రావుల అంజిబాబు, ఉద్యోగుల సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు శివకృష్ణ, ప్రధాన కార్యదర్శి వి రమేష్ బాబురెడ్డి, సుబ్బా రావు, లక్ష్మీనారాయణ, ఎంవీఎస్ కోటిరెడ్డి, బాలకృష్ణ, మహిళా విభాగం కన్వీనర్ భాను, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.


ఎన్‌టీఆర్ సహకార భవన్‌ఎదుట నిరసన తెలియ జేస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు

ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం

గుంటూరు(విద్య) జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) 79వ ఆవిర్భావ దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వ హించారు. స్థానిక కంకరగుంటలోని జిల్లా కార్యాలయంలో జరిగిన వేడుకల్లో జిల్లా అధ్యక్షుడు పెదబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో, సౌకర్యాలు కల్పించడంలోనూ ప్రభుత్వంతో పోరాడి సాధించటంలో ఎస్టీయూ కృషి చేసిందన్నారు. కార్యక్రమం లో జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే సుబ్బారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్య క్షుడు షేక్ మహబూబ్ సుభాని, తుళ్లూరు మండల అధ్యక్షుడు పి.దిబ్బయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శ్యాంబాబు, కార్యదర్శి మహంకాలరావు, రాష్ట్ర కౌన్సిలర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి సహకరించడం అభినందనీయం

గుంటూరు మెడికల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తాము చదువుకున్న వైద్య కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేయూతనివ్వడం హర్ష ణీయమని జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారీ తెలిపారు. ఆధునికీకరించిన వైద్య కళాశాల రెండో ప్రవేశ ద్వారాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ గేటు ఏర్పాటుకు జీఎంసీ పూర్వ విద్యార్థి, న్యూరో సర్జన్ డాక్టర్ హేమంత్ ఉప్పుటూరి రూ.4 లక్షల విరాళం అం దజేశారు. కాగా సోమవారం జరిగిన ప్రవేశ ద్వారం ప్రారంభోత్సవ కార్యక్రమంలో దాత డాక్టర్ హేమంత్‌తో పాటు జీఎంసీ వైస్ ప్రిన్సి పాళ్లు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ శేషాద్రి శేఖర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం దాత డాక్టర్ హేమంత్ ఉప్పుటూరిని ప్రిన్సి పాల్, వైస్ ప్రిన్సిపాళ్లు సత్కరించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్ల నిర్వహణలో భాగం గా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయను న్నట్లు డిప్యూటీ ఈఈ ఎన్ గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రమౌళీనగర్ ఐదో లైను నుంచి 7వ లైను పరిసర ప్రాంతాల్లో ఉద యం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.



పొన్నూరు పట్టణంలో భారీ నిరసన ప్రదర్శన చేస్తున్న కూటమి నాయకులు, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర తదితరులు

భగ్గుమన్న మహిళలు

❖ జగన్ మీడియాలో అసభ్యకర వ్యాఖ్యలపై ఆందోళనలు
❖ పత్రికా కార్యాలయం ముట్టడి, పత్రికా ప్రతుల దహనం

పొన్నూరుటౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలను కించపరిచే విధంగా భారతిరెడ్డిని ర్వహిస్తున్న సాక్షి చానల్‌లో చేయించిన అభ్యంతకర వ్యాఖ్యలు మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశాయని ఎమ్మెల్యే, సంగం డెయిరి చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పొన్నూరు పట్టణంలో సాక్షి చానల్, పత్రికకు వ్యతిరేకంగా సోమవారం కూటమి పార్టీలు, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో మహిళలు నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం జగన్‌కు చెందిన దిన పత్రిక ప్రతులను తగులబెట్టారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ మహిళల ఆత్మగౌరవం దెబ్బతినే విధంగా జర్నలిస్టు ముసుగులో ఉన్న కొమ్మినేని శ్రీనివాస్, కృష్ణంరాజు మాట్లాడడం దారుణమన్నారు. సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునే విధంగా వారి వ్యాఖ్యలను ప్రసారం చేసిన సాక్షి యజమాని భారతిరెడ్డి తక్షణమే తమ పత్రిక, చానల్ ద్వారా బహిరంగ క్షమాపణ కోరాలని డిమాండ్ చేశారు. లేకుంటే సాక్షి పత్రికను బహిష్కరించడంతో పాటు తమదైన రీతిలో నిరసన తెలుపుతామని హెచ్చరించారు. ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ.. 11 సీట్లకు పరిమితమైన.. ప్రజా తీర్పుతో ప్రతిపక్ష హోదాను కోల్పోయిన జగన్‌లో ఇప్పటికి అహంకారం తగ్గలేదని ఆరోపించారు. మరోసారి అధికారం ఇవ్వలేదన్న అక్కసుతో తన చానల్‌లో మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతిశాడని ఆరోపించారు.

సాక్షి కార్యాలయాన్ని ముట్టడించిన తెలుగు మహిళలు

● కొమ్మినేని, కృష్ణంరాజు ఫొటోలు, పేపర్ ప్రతుల దహనం

గుంటూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలోని మహిళలను కించపరిచేలా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ తెలుగు మహిళలు గుంటూరు అరండల్ పేటలోని సాక్షి కార్యాలయాన్ని సోమవారం ఉదయం ముట్టడించారు.. దారుణమైన వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజు, ఆ వ్యాఖ్యలను ప్రోత్సహించి ప్రసారం చేసిన కొమ్మినేని శ్రీనివాస్, చానెల్ యాజమాన్యాన్ని శిక్షించాలని డిమాండ్ చేశారు. తెలుగు మహిళ పశ్చిమ నియోజకవర్గ అధ్యక్షురాలు దాసరి జ్యోతి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పా ల్గొని కొమ్మినేని, కృష్ణంరాజు ఫొటోలు, దిన పత్రికా ప్రతులను తగులపెట్టారు. చెప్పులు చూపిస్తూ నిరసన తెలిపారు. చానల్ ఎండీ భారతిరెడ్డి, జగన్మోహన్ రెడ్డి ఖండించనందుకు మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళా నాయకులు పాల్గొన్నారు.



కొమ్మినేని, కృష్ణంరాజు ఫొటోలు, పేపర్ ప్రతులను తగలబెడుతున్న మహిళలు

పత్రికా కార్యాలయం వద్ద మహిళల ధర్నా

❒ భారతీ రెడ్డి క్షమాపణలు చెప్పాలని డిమాండ్
❒ బారికేడ్లు అడ్డుపెట్టి నిలువరించిన పోలీసులు

మంగళగిరి సిటీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జగన్ మీడియాలో అమరావతి మహిళలను కించపరుస్తూ ఎనలిస్ట్ కృష్ణంరాజు, జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలపై మహిళల్లో ఆగ్రహావేశాలు పెల్లుబుకుతూనే ఉన్నాయి. అమరావతి రాజధాని ప్రాంత మహిళలు, రైతులు సోమవారం సాయంత్రం గుంటూరు జిల్లా మంగళగిరి తెనాలి రోడ్డులోని పత్రికా కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. కృష్ణంరాజు, కొమ్మినేని, యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అమరావతి ప్రాంత మహిళలపై అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. అమరావతి మహిళలు, రైతులపై అత్యంత జుగుప్సాకరమైన వ్యాఖ్యలను ప్రోత్సహించిన సాక్షి యాజమాని భారతీ రెడ్డి మహిళా లోకానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావులను అభినవ కీచకులు, వ్యవస్థీకృత నేరగాళ్లుగా అభివర్ణించారు. చెప్పులు, చీపుర్లు, చేటను చూపిస్తూ నిరసన తెలియజేశారు. గంటన్నరపాటు ఆందోళన నిర్వహించారు. మహిళల ఆందోళనతో మంగళగిరి సాక్షి కార్యాలయం వద్ద భారీగా పోలీసులను మోహరించారు. అమరావతి మహిళలు పలుమార్లు లోపలకు వెళ్లేందుకు యత్నించగా పోలీసులు బారికేడ్లను అడ్డుగా పెట్టి నిలువరించారు. అయినప్పటికీ గేటు దూకే ప్రయత్నం చేశారు. పత్రిక నేమ్ బోర్డును ధ్వంసం చేశారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. అనంతరం కార్యాలయం ఎదురుగా దిష్టిబొమ్మను దహనం చేశారు. కృష్ణంరాజు, కొమ్మినేని, సాక్షి యాజమాన్యంపై చర్యలు తీసుకోకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



మంగళగిరి సాక్షి కార్యాలయం ఎదుట దిష్టిబొమ్మను దహనం చేస్తున్న రైతులు

పత్రికా ప్రతుల దహనం

బాపట్ల, జూన్ 9(ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజధాని మహిళలను అగౌరవ పరుస్తూ జగన్ మీడియా డిబేట్‌లో వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావులపై చర్యలు తీసుకోవాలని తెలుగు మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టీడీపీ పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజనీ తెలుగు మహిళలు, తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులతో కలిసి సూర్యలంక రోడ్డులోని టీడీపీ కార్యాలయం నుండి ర్యాలీగా అంబేద్కర్ సర్కిల్ చేరుకున్నారు. సాక్షి పత్రిక ప్రతులను కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు ఫొటోలను దహనం చేశారు.



బాపట్ల అంబేడ్కర్ సర్కిల్‌లో సాక్షి పత్రిక పేపర్లు, కొమ్మినేని శ్రీనివాసరావు ఫొటోలు దహనం చేస్తున్న తెలుగు మహిళలు

12న సుపరిపాలన - స్వర్ణాంధ్ర

వెలగపూడి సచివాలయం దగ్గర్లో కార్యక్రమం
పాల్గొననున్న సీఎం చంద్రబాబునాయుడు
ఏర్పాట్లపై అధికారులకు కలెక్టర్ సూచనలు



సుపరిపాలన - స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్

తుళ్లూరు,(వెలగపూడి) జూన్ 9(ఆంధ్రజ్యోతి) కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం పూర్తి అయ్యింది. ఈ నెల 12న సుపరిపాలన - స్వర్ణాంధ్ర కార్యక్రమాలు మండల కేంద్రాలు, నియోజకవర్గాల్లో నిర్వహించాలని సీఎం చంద్రబాబు నాయుడు కూటమి నేతలకు సూచించారు. వెలగపూడి సచివాలయం దగ్గర్లో జరిగే కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొననున్నారు. సోమవారం కార్యక్రమ ప్రదేశాన్ని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి అధికారులతో కలసి పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులకు తగిన సూచనలు చేశారు. పకడ్బందీగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పరిశీలనలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, జేసీ భార్గవ తేజ, రాష్ట్ర ప్రొటో కాల్ డైరెక్టర్ మోహనరావు, గుంటూరు ఆర్డీవో శ్రీనివాసరావు, డీఎస్పీ మురళీకృష్ణ, తుళ్లూరు తహసీల్దారు ఉన్నారు.

80.19 శాతం రేషన్ పంపిణీ

మూడు జిల్లాల్లో 13.19 లక్షల కార్డులకు..

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి): ఆటోలను తొలగిస్తే రేషన్ పంపిణీ కష్టమవుతుంది. కార్డుదారులు ఇక్కట్లు పడతారని నానా యాగీ చేసిన వైసీపీకి.. కూటమి ప్రభుత్వం ఆచరణలో రేషన్ పంపిణీ చేసి.. సమాధానం చెప్పింది. ఆటోలు లేకున్నా సకాలంలో కార్డుదారులకు బియ్యం పంపిణీ చేయడం సాధ్యమేనని నిరూపించింది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో తొమ్మిది రోజుల్లోనే 13,19,712 కార్డులకు రేషన్ పంపిణీ చేయడం జరిగింది. మరో ఆరో రోజుల పాటు రేషన్ పంపిణీ జరగనుంది. వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకే వెళ్లి డీలర్లు బియ్యం అందజేశారు. నేరుగా ఇంటికే బియ్యం పంపిణీ చేయడంతో ఆయా వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. గతంలో వృద్ధులు, దివ్యాంగులు ఆటోల వద్ద క్యూలో నిల్చొని బియ్యం తీసుకొవాల్సి వచ్చేది. ఆ కష్టాలను కూటమి ప్రభుత్వం తొలగించింది.

కార్డుదారులకు బియ్యం పంపిణీలో పల్నాడు జిల్లా 80.19 శాతంతో ముందు వరుసలో నిలిచింది. ఈ జిల్లాలో 6,34,893 కార్డులు ఉండగా సోమవారం నిర్ణీత సమయం ముగిసే సరికి 5,12,914 కార్డుదారులకు రేషన్ పంపిణీ చేసినట్లు పౌర సరఫరాల శాఖ లెక్కలు తెలిపాయి. బాపట్ల జిల్లాలో 77.35 శాతం కార్డులకు అంటే.. 4,76,529 కార్డులకు గాను 3,68,600 కార్డులకు రేషన్ అందింది. గుంటూరు జిల్లాలో 5,89,531 కార్డులు ఉండగా 4,38,198 కార్డులకు రేషన్ పంపిణీ చేశారు. మరో రెండు రోజుల్లో రేషన్ పంపిణీ పూర్తి అవుతుందని సదరు అధికారులు తెలిపారు. రేషన్ పంపిణీపై వైసీపీ చేసిన విమర్శలను ప్రభుత్వం తిప్పికొట్టడంలో సక్సెస్ అయింది. పింఛన్‌ల పంపిణీ తరహాలోనే రేషన్ కూడా లబ్ధిదారులకు ప్రభుత్వం సకాలంలో అందజేస్తుండటంతో కార్డుదారుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.



రేషన్ కోసం షాపు వద్ద మహిళలు

మార్కెటింగ్‌లో బదిలీలలు

● కౌన్సెలింగ్ సందర్భంలో ఒక జాబితా రూపకల్పన ● చివరికి నలుగురిని మినహాయించి విడుదల ● నివ్వెరపోతున్న అధికార, ఉద్యోగ వర్గాలు



గుంటూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మార్కెటింగ్ శాఖలో బదిలీల ప్రక్రియ పూర్తి అయింది. సోమవారం రాత్రి 9 గంటల తర్వాత డిప్యూటీ డైరెక్టర్లు, సెలెక్షన్ గ్రేడ్ సెక్రెటరీ, అసిస్టెంట్ డైరెక్టర్లు, స్పెషల్ గ్రేడ్, గ్రేడ్-1, 2, 3 కార్యదర్శుల బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. తమకు బదిలీ ఉండదని భావించిన కొందరికి అనూహ్యంగా ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ చేతిలో పెట్టారు. మార్కెటింగ్ కమిషనర్ విజయ సునీత సెలవులో ఉండటంతో ఆమె స్థానంలో ఇన్‌చార్జిగా ఉన్న స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ అధికారి కింది స్థాయి ఉద్యోగుల బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. సెక్రెటరీలు, ఏడీలు, డీడీల బదిలీ ఉత్తర్వులు మాత్రం స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ విడుదల చేశారు.

కాగా మిర్చి యార్డులో వివిధ హోదాల్లో ఉద్యోగుల బదిలీల్లో పెద్ద ఎత్తున పైరవీలు కొనసాగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కౌన్సెలింగ్ సందర్భంగా విజిలెన్స్ కేసులో ఉన్న 18 మందితో పాటు మరికొందరిని కూడా బదిలీ చేసేందుకు నిర్ణయించారు. అయితే కమిషనర్ విజయ సునీత సెలవులోకి వెళ్లడం, ఆ తర్వాత ఎస్‌డబ్ల్యూసీ ఎండీ ఇన్‌చార్జిగా రావడంతో చాలా మార్పులు జరిగాయి. మిర్చి యార్డు ఇన్‌చార్జిగా ఉన్న సుబ్రహ్మణ్యం డిప్యూటేషన్‌ని రద్దు చేసి సంతనూతలపాడుకు రివర్ట్ చేశారు. తాడికొండ సెక్రటరీ పద్మావతి డిప్యూటేషన్‌పై యార్డులో విధులు నిర్వహిస్తుండగా కౌన్సెలింగ్‌లో ఆమెను వెనక్కు పంపాలని నిర్ణయించారు. అయితే బదిలీ ఉత్తర్వుల్లో పద్మావతిని గుంటూరు ఏఎంసీలోనే డిప్యూటేషన్‌పై కొనసాగించారు. అలానే యూడీసీ నరేంద్ర, వివిధ గ్రేడ్‌ల సెక్రటరీలు శ్రీకాంత్, ఆంజనేయులుని కూడా కౌన్సెలింగ్‌లో వేరే ఏఎంసీలకు మార్కింగ్ చేశారు. అయితే తుది ఉత్తర్వుల్లో వాళ్లని బదిలీ నుండి మినహాయించారు. మిర్చి యార్డులో బదిలీల వెనక రాజకీయ, అధికారుల సిఫార్సులు, నగదు బాగా పని చేశాయన్న ఆరోపణలు వస్తున్నాయి.

- డిప్యూటీ డైరెక్టర్ హోదాలో విజయవాడ ఏఎంసీలో విధులు నిర్వహిస్తున్న ఎం.దివాకర్‌ని గుంటూరు మార్కెటింగ్ డీడీగా, దుగ్గిరాల సెలెక్షన్ గ్రేడ్ సెక్రెటరీ ఎన్.శ్రీనివాసరావుని కొవ్వూరు ఏఎంసీకి, గుంటూరు డీడీ కె.ఝాన్సీరాణిని తణుకు ఏఎంసీ సెలెక్షన్ గ్రేడ్ సెక్రెటరిగా, పొన్నూరు ఏఎంసీ సెలెక్షన్ గ్రేడ్ సెక్రెటరి పి.రామారావుని పెనుగొండ ఏఎంసీకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.
- సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీల హోదాలో తెనాలి ఏఎంసీకి చెందిన జేవీ సుబ్బారావుని దుగ్గిరాలకు, చిలకలూరిపేట ఏఎంసీకి చెందిన యూ యోగేశ్వరరావుని ఆకివీడుకు, భీమవరం ఏఎంసీకి చెందిన జి.ప్రసన్నకుమారిని పొన్నూరు ఏఎంసీకి, ఆకివీడు ఏఎంసీ నుంచి డీసీహెచ్ సుబ్బారావు తెనాలి ఏఎంసీకి, తణుకు ఏఎంసీ నుంచి డి.తిరుపతిరాయుడు చిలకలూరిపేటకు బదిలీ అయ్యారు.
- అసిస్టెంట్ డైరెక్టర్ హోదాలో ఒంగోలు ఏడీఎం కేవీఎస్ ఉపేంద్ర నరసరావుపేట ఏఎంసీకి, గుంటూరు ఏడీఎం బి.రాజబాబు తిరువూరు ఏఎంసీకి స్పెషల్ గ్రేడ్ సెక్రటరీగా, నరసరావుపేట ఏఎంసీ నుండి కె. సూర్యప్రకాష్‌రెడ్డిని అద్దంకికి, అనంతపురం ఏడీఎం పి.సత్యన్నారాయణ చౌదరి గుంటూరు ఏడీఎంగా, మంగళగిరి సెక్రెటరి ఎ.భాస్కరరెడ్డిని కూచినపూడికి బదిలీ చేశారు.

అత్యవసర బాధలకు చెక్!

❖ పర్యావరణ హితంగా పోర్టబుల్ ఈ-టాయిలెట్లు
❖ మంగళగిరి, తాడేపల్లిలో ఏర్పాటుకు సన్నాహాలు
❖ మంత్రి లోకేశ్ చొరవతో తీరనున్న బాధలు..
❖ చంటి బిడ్డలకు పాలిచ్చే సౌకర్యం కూడా..



మంగళగిరికి చేరుకున్న ఈ-టాయిలెట్లు

మంగళగిరి సిటీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ ప్రజలకు ఈ-టాయిలెట్లు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. పూర్తి పర్యావరణ హితంగా దుర్గంధం, దుర్వాసన లేని ఈ-టాయిలెట్లను మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ మంగళగిరి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా అభివృద్ధి చేసేందుకు నిత్యం అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ పలు సూచనలు చేస్తున్నారు. దీనిలో భాగంగానే హైదరాబాద్, బెంగళూరు వంటి మహానగరాల్లో ఏర్పాటు చేసిన దుర్వాసన లేని ఈ-టాయిలెట్లను తన సొంత నిధులతో నియోజకవర్గంలోని ముఖ్య కూడళ్లలో ఏర్పాటు చేయించాలని నిర్ణయించారు.

పెరిగిన జనాభా..

అమరావతి రాజధాని ప్రాంతానికి ముఖద్వారంగా ఉన్న మంగళగిరి పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. గతంలో 2014-19 మధ్య కాలంలో అమరావతి నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్న సమయంలో ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది కార్మికులు, చిరు వ్యాపారులు, ఉద్యోగులు ఇక్కడికి వలస వచ్చారు. ఆ తర్వాత వైసీపీ హయాంలో రాజధాని నిర్మాణ పనులు ఆగిపోవడంతో కార్మికులు, చిరు వ్యాపారులు సొంత రాష్ట్రాలకు వెళ్లిపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమరావతి పనులు ఊపందుకోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి మళ్లీ భారీగా కార్మికులు, చిరు వ్యాపారులు ఇక్కడికి చేరుకున్నారు. వ్యాపార మార్కెట్ రోజు రోజుకు గణనీయంగా పెరుగుతోంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పబ్లిక్ టాయిలెట్లు లేకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. దీంతోపాటు వివిధ పనుల నిమిత్తం అనేక మంది నిత్యం మంగళగిరి వస్తుంటారు. స్థానికంగా అనేక దుకాణాల్లో పనిచేసే గుమస్తాలు, మహిళా ఉద్యోగులు, కార్మికులకు పబ్లిక్ టాయిలెట్లు, మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడంతో బాధ పడుతున్నారు. ప్రజల ఇబ్బందులను గమనించిన మంత్రి నారా లోకేశ్ కొత్త తరహా ప్రజా మరుగుదొడ్ల నిర్మాణంపై దృష్టి సారించారు. అధునాతన టెక్నాలజీతో కూడిన ఈ-టాయిలెట్లను ఇక్కడ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

తొలుత ఆ రెండు ప్రాంతాల్లో..

తొలుత అత్యంత రద్దీగా ఉండే మంగళగిరి పాత బస్టాండు సెంటరు, తాడేపల్లి మణిపాల్ ఆస్పత్రి సమీపంలో రెండు ఈ-టాయిలెట్లను ఏర్పాటు చేయాలని నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు. భవిష్యత్తులో నగరంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయనున్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా ఈ-టాయిలెట్లను ఏర్పాటు చేయడంతోపాటు చంటి బిడ్డలకు పాలు ఇచ్చేందుకు ప్రత్యేక ఏర్పాట్లను కూడా చేయనున్నారు. భవిష్యత్తులో నగరంలో రహదారుల విస్తరణ జరిగితే ప్రీఫ్యాబ్ టెక్నాలజీతో తయారు చేసిన పోర్టబుల్ ఈ-టాయిలెట్లను వేరే ప్రాంతానికి సులువుగా తరలించే అవకాశం ఉంది. ఈ-టాయిలెట్ల ఏర్పాటుకు మంత్రి లోకేశ్ చర్యలు తీసుకోవడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అపరిచితులకు ఆశ్రయం ఇవ్వవద్దు: అర్బన్ సీఐ

పొన్నూరు టౌన్,జూన్9(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని లాడ్జీలు, విశ్రాంతి భవనాల్లో అపరిచితులకు ఆశ్రయం ఇవ్వవద్దని అర్బన్ సీఐ ఎల్. వీరానారక్ హెచ్చరించారు. పట్టణంలోని లాడ్జీలలో సోమవారం సీఐ వీరానాయక్ సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా లాడ్జీల నిర్వాహకులకు పలు హెచ్చరికలు జారీ చేశారు. లడ్జీలకు వచ్చేవారికి ఆధార్ వంటి ఐడీ ప్రూఫ్‌ను చిరునామా వంటి వివరాలను తప్పని సరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఎటువంటి గుర్తింపుకార్డు లేని వారికి ఆశ్రయం ఇవ్వవద్ధని హెచ్చరించారు. అ సాంఘీక కార్యలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో సిబ్బంది పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

పురపాలక సంఘానికి ఆరు అర్జీలు

తెనాలి, మారీసుపేట,జూన్ 9(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఆరు అర్జీలు వచ్చాయని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. సోమవారం పట్టణ పురపాలక సంఘం కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న పలు శాఖల అధికారులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇంజనీరింగ్ సెక్షన్‌కి మూడు, టౌన్ ప్లానింగ్ విభాగానికి ఒకటి, శానిటేషన్ సెక్షన్‌కి రెండు అర్జీలు వచ్చాయన్నారు. ఈ సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించి త్వరతగతిన పరిష్కరిస్తామని శేషన్న తెలిపారు. కార్యక్రమంలో పురపాలక సంఘ పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి 4..

తెనాలి రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నాలుగు అర్జీలు అందినట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. అందులో సర్వేకు 1, దేవదాయభూమి ఆక్రమణకు సంబంధించి 1, రేషన్ కార్డు 1, కుమారుడు కొడుతున్నాడని రక్షణ కల్పించాలని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు 1 ఉన్నాయన్నారు. నిర్ణీత సమయంలోపు వాటిని పరిష్కరించడం జరుగుతుందని తహసీల్దార్ స్పష్టం చేశారు.

పొన్నూరులో...

పొన్నూరు టౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 8 ఫిర్యాదులు అందినట్లు తహసీల్దార్ జియావుల్ హక్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సర్వే కోసం 2, సివిల్ సప్లై 4, రెవెన్యూ సంబంధిత సమస్యలు రెండింటిపై ఫిర్యాదులు అందాయి. పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

యానాదులకు ఆధార్ గుర్తింపు ఇవ్వాలి

పొన్నూరు టౌన్,జూన్9(ఆంధ్రజ్యోతి):సంచారజీవితంగడుపుతున్న నిరుపేద యానాది కుటుంబాలకు ఆధార్ గుర్తింపు ఇవ్వాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం యానాది కుటుంబాలతో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ పొన్నూరులో 16,25 వార్డుల్లో నివసించే యానాది కుటుంబాల పిల్లలకు ఎటువంటి జన్మధ్రువీకరణ పత్రాలు లేక ఆధార్ కార్డులు మంజూరు కావడం లేదన్నారు. జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి వచ్చే వారి కుటుంబాల్లో పిల్లలకు ఆధార్ లేక, రేషన్‌కార్డులలో వారి పేర్లు నమోదు కాక ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడంలేదన్నారు. వితంతు పింఛన్ల వంటివి కూడా అందడంలేదన్నారు. తక్షణమే రెవెన్యూ, మునిసిపల్ అధికారులు ఈ సమస్యను పరిష్కరించి యానాదుల పిల్లలకు ఆధార్ గుర్తుంపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆర్ఎటి రామారావు, దేవరకొండ శ్రీనివాస్, మహిళాసమాఖ్య పట్టణ అధ్యక్షురాలు రావూరి సుగుణ పాల్గొన్నారు.

అంజుమన్ కమిటీకి రూ.లక్ష విరాళం

పొన్నూరు టౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పొన్నూరులో నిర్మితమౌతున్న అంజుమన్ షాపింగ్ కాంప్లెక్స్‌కు సోమవారం రూ.లక్ష విరాళం అందింది. ప్రముఖ న్యాయవాది షేక్ అబ్దుల్ అజీజ్ జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు రూ.లక్ష నగదును కమిటీ అధ్యక్షుడు మగ్బుల్ బేగ్‌కు అందించారు. కార్యక్రమంలో షేక్ బాబ్జీ, మహమ్మద్ గౌస్, షేక్ మౌలాళి, షేక్ అబ్దుల్‌మజీద్ పాల్గొన్నారు.

రేపు సాహిత్య బాటసారి శారద పుస్తకావిష్కరణ

తెనాలి అర్బన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఏఎస్ఎన్ కళాశాలలో బుధవారం సాహిత్య బాటసారి శారద స్మృతి శకలాలు పుస్తకావిష్కరణ జరుగుతుందని అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ తెలిపారు.

రాజధాని కట్టకపోగా అవాకులు చవాకులు: చందు

తెనాలి అర్బన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నాయకులు ఐదేళ్లలో రాజధాని కట్టడం చేతకాకపోగా అవాకులు చవాకులు పేలడం సరికాదని నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు విమర్శించారు. కొత్తపేటలో సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ, అమరావతి రాజధానిపై ఐదేళ్ల నుండి ఏదో ఒక దుమ్మెత్తి పోస్తున్నారని మండి పడ్డారు. రాష్ట్ర అభివృద్ధి ఏమైపోతుందో, రాజధాని లేకపోతే ఏ నష్టం జరుగుతుందో గ్రహించడం లేదన్నారు. ఈ పార్టీ వారైన రాష్ట్రం కోసం పాటు పడాలే కానీ రాష్ట్రాభివృద్ధిని దెబ్బకొడితే ఎలాగని ప్రశ్నించారు. పార్టీలకు అతీతంగా రాజధానిపై చేసిన వ్యాఖ్యలను ఖండించాలన్నారు. స్వప్రయోజనాలకు మీడియాను తాకట్టు పెట్టకూడదని, కొంత మీడియాను అడ్డం పెట్టుకుని పబ్బం గడుపుకోవాలని చూస్తే ప్రజలు ఊరుకోరని, మీడియా లక్ష్యం నెరవేరదన్నారు. మీడియా అనుసరించే పక్షపాత వైఖరిని ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలన్నారు. పార్టీ నాయకులు పొన్నూరు శశి, గుర్రపు ద్వారకా శ్రీనివాసరావు, శంకరరావు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై విద్వేష వ్యాఖ్యలు అహంకారపూరితం

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మహిళలపై భారతిరెడ్డి మీడియాలో చేసిన విద్వేషపూరిత వ్యాఖ్యలు అహంకార భరితంగా ఉన్నాయని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ధ్వజమెత్తారు. రాష్ట్ర మహిళలపై సాక్షి మీడియాలో చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కూటమి పార్టీల ఆధ్వర్యంలో సోమవారం మహిళలు నిరసన ప్రదర్శన, నిరసన దీక్షలు నిర్వహించారు. పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహం నుంచి కూరగాయల మార్కెట్ వరకు అక్కడ నుంచి తిరిగి ఐలాండ్ సెంటర్ వరకు మహిళలు భారీ ప్రదర్శన చేశారు. అనంతరం ఐలాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన దీక్ష శిబిరంలో పెద్ద సంఖ్యలో మహిళలు దీక్షల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలపై విద్వేషపూరిత వ్యాఖ్యలుచేసిన కృష్ణంరాజు, ప్రోత్సహించిన కొమ్మినేని శ్రీనివాస్‌ను అరెస్టుచేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. కీచక కృష్ణంరాజును బహిష్కరించాలని నినాదాలు చేశారు. సాక్షి వికృత చర్యలను శిక్షించి సరైన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. సాక్షి ప్రసారాల అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మీడియా జర్నలిజాన్ని భ్రష్టు పట్టిస్తున్న సాక్షి ప్రసారాలను, పేపర్‌లను అడ్డుకుంటామని హెచ్చరించారు. వైఎస్ భారతి బేషరతుగా క్షమాపణలు చెప్పకపోతే తాడేపల్లి ప్యాలెస్, సాక్షి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. దీక్షల శిబిరంలో పాల్గొన్న పలువురు మహిళలు వైసీపీ అధినేత జగన్, వైఎస్ భారతి సాక్షి మీడియా ధ్వజమెత్తారు. తక్షణమే మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన భారతి క్షమాపణలు చెప్పాలని లేదంటే ప్రభుత్వం సాక్షి మీడియాను బ్యాన్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ దేశంలో మహిలను దేవతలుగా పూజిస్తారన్నారు. అలాంటి మహిళలను సాక్షి మీడియా సాక్షిగా అవమానించడమే కాకుండా అమరావతిపై విషం చల్లుతున్నారని దుయ్యబట్టారు. ప్రజల తీర్పును అవమానించేలా వెన్నుపోటు దినం నిర్వహించి వైసీపీ ప్రజా తీర్పునే అవహేళన చేసేలా వ్యవహరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలపై వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయన్నారు. మహిళలపై వైసీపీ అధినేతకు ఎందుకు అంత ద్వేషం అని ప్రశ్నించారు. మేధావులు కూడా మౌనం వీడి మహిళలపై జరిగిన వ్యాఖ్యలను ఖండించాలని డిమాండ్ చేశారు. మహిళలను కించపరిచేలా మాట్లాడితే సహించబోమని హెచ్చరించారు. తెనాలిలో రౌడీషీటర్లను పరామర్శించి అసాంఘీక శక్తులను కొమ్ముకాసేలా జగన్‌రెడ్డి ప్రజాస్వామ్యంలో మనుజాలడన్నారు. పలువురు కూటమి పార్టీల నాయకులు వైసీపీ మీడియా చర్యలను తీవ్రంగా ఎండగట్టారు. కార్యక్రమంలో మహిళలు, కూటమి పార్టీల నాయకులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పొన్నూరు పట్టణంలో భారీ నిరసన ప్రదర్శన చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు



తెనాలిలో కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు చిత్రాలను దహనం చేస్తున్న తెలుగు మహిళలు

తెనాలిలో...

తెనాలి రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని ప్రాంత మహిళలపై సాక్షి మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాస్‌లను చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని తెలుగు మహిళలు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద రోడ్డుపై కొమ్మినేని శ్రీనివాస్, కృష్ణంరాజుల ఫొటోలతో ప్రతులను దహనంచేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజధాని అమరావతిగా కొనసాగనివ్వకుండా ఐదేళ్ల వైసీపీ పాలనలో అనేక విధాలుగా అడ్డుకోవడమే కాకుండా భూములిచ్చిన రైతు కుటుంబంలో మహిళలపై దాడులకు కూడా వెనకాడలేదని విమర్శించారు. చంద్రబాబు సీఎంగా రాజధానిని అభివృద్ధి చేస్తుంటే చూసి ఓర్వలేక వైసీపీ మీడియా సాక్షిలో విద్వేషాలు రెచ్చగొట్టేలా అమరావతిని వేశ్యల ప్రాంతమంటూ మహిళలను నీచంగా మాట్లాడటం దుర్మార్గమన్నారు. సభ్యసమాజం తలదించుకునేలా ప్రవర్తించిన సాక్షి మీడియాను డిబేట్ చేసిన కొమ్మినేని శ్రీనివాస్, కృష్ణంరాజులను నాన్‌బెయిల్‌బుల్ సెక్షన్లకింద కేసులు నమోదుచేసి కఠినంగా శిక్షించాలని కోరారు. లేనిపక్షంలో నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అనిత, మల్లేశ్వరి, రమ్య, యనమల అనిత, భావన, సీతారత్నం, కామేశ్వరి, కోటేశ్వరి పలువురు మహిళలు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చు

● మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ యోగాభ్యాసంతో మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. సోమవారం స్థానిక రజకపేటలోని రజకపార్కులో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగాంధ్రా శిక్షణ శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కమిషనర్ బండి శేషన్న తహసీల్దార్ గోపాలకృష్ణతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం వారి ఆదేశాల మేరకు ప్రత్యేక యోగాంధ్రా శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. యోగా అంటే శారీరక వ్యాయామాలు, ఆసనాలు చేయడం మాత్రమే కాదు దీని వలన మేధాశక్తి, ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. ప్రతిరోజు యోగా ధ్యానం వలన మానసిక, శారీరక ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందన్నారు. యోగాతో ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడమే కాకుండా ఏకాగ్రతను పెంచుతుందని ఒత్తిడిని తగ్గిస్తుందన్నారు. అనంతరం పట్టణంలో యోగా దినోత్సవ ర్యాలీని మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక జెండాను ఊపి ప్రారంభించారు. సత్యనారాయణ టాకీస్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, కౌన్సిలర్ వి.విజయలక్ష్మి, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, మేనేజర్ విల్సన్ జయకర్, డీఈ శ్రీనివాసులు, మున్సిపల్ ఆఫీస్ అవుట్ డోర్, ఇండోర్ స్టాఫ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



యోగాభ్యాసాన్ని పరిశీస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న, తహసీల్దార్ గోపాలకృష్ణ తదితరులు

పొన్నూరులో...

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మానసిక ఒత్తిడిని జయించడానికి యోగాభ్యాసం ఉత్తమ మార్గమని ఎంపీడీవో ఊహారాణి అన్నారు. చేబ్రోలులో సోమవారం పలు ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో యోగాంధ్ర అవగాహన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ పని భారం వలన శరీరం, మనస్సు ఒత్తిడి, ఆందోళలను గురవుతున్నాయన్నారు. వీటిని అధిగమించడానికి యోగా ప్రయోజకరంగా ఉంటుం దన్నారు. యోగాను అభ్యసించడం వలన ప్రశాంతత, ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసశర్మ, ఏవో ఉమాదేవి, పలు ప్రభుత్వ కార్యాలయాల ఉద్యోగులు, మహిళలు పాల్గొన్నారు.

కొల్లిపరలో...

కొల్లిపర, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ యోగా చేయడం అలవాటు చేసుకోవాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. సోమవారం మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర, తూములూరు, అత్తోట తదితర గ్రామాల్లో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రజలను చైతన్య పరిచేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ యోగా శారీరక, మానసిక, ఆధ్మాత్మిక, అభ్యాసంతో సంపూర్ణ ఆరోగ్యంతో జీవించటానికి ఉపయోగపడుతుందన్నారు. నేటి ఆధునిక జీవనశైలి ఒత్తిడిని అధిగమించాలంటే యోగా ఒక్కటే ఏకైక మార్గం అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి, ఈవోపీఆర్‌డీ భార్గవ్, సచివాలయం సిబ్బంది, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

పెదకాకానిలో...

పెదకాకాని, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా యోగా చేయాలని, అప్పుడే వారికి సంపూర్ణ ఆరోగ్యం అందుతుందని పెదకాకాని ఎంపీడీవో ఆర్ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం పెదకాకానిలో యోగాంధ్రపై ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని ఈ నెల 21వ తేదీన దేశవ్యాప్తంగా యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రధాని, ముఖ్యమంత్రి పాల్గొంటారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, కార్మికులు పాల్గొన్నారు.

వృద్ధ తల్లిదండ్రుల వేదన..

● ఆస్తుల కోసం కొడుకుల కర్కశత్వం
● ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు

తెనాలి రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను వృద్ధాప్యంలో కంటికి రెప్పలా చూసుకోవాల్సిన పిల్లలే ఆస్థుల కోసం వారిని వేదింపులకు గురిచేస్తున్నారు. కొడుకుల తీరు బయటకు చెప్పుకోలేక కుమిలిపోతూ గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రభుత్వ అధికారులను వృద్ధ తల్లిదండ్రులు ఆశ్రయిస్తున్నారు. సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు కొడుకులు ఆస్తుల కోసం వేధిస్తున్నారంటూ తహసీల్దార్ గోపాలకృష్ణ ఎదుట కన్నీరు మున్నీరుగా విలపిస్తూ అర్జీలు అందజేశారు.

● మండలంలోని బుర్రిపాలేనికి చెందిన రమాదేవి కొడుకుతో కలిసి ఉంటోంది. భర్త తదనంతరం వచ్చిన ఆస్థికోసం కొడుకు వేణు వేధింపులు తారస్థాయికి చేరడంతో గత్యంతరం లేక తహసీల్దార్‌ను ఆశ్రయించి, న్యాయం చేయాలని అర్జీ అందజేశారు.

● అదేవిధంగా మండలంలోని పెదరావూరుకు చెందిన శివరామకృష్ణ తన ఆస్థిని రాయించుకున్న కుమారుడు తన యోగక్షేమాలు చూడకుండా పొలాన్ని కౌలుకు ఇచ్చుకుంటూ శత్రువుకన్నా.. దారుణంగా చూస్తున్నాడంటూ ఆవేదన చెందారు.

● తాడిబోయిన శివవెంకట్రావుకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు. ఓ కుమారుడు ప్రేమ వివాహం చేసకుని, మద్యానికి బానిసై రోజు తాగి వచ్చి తనను, తన భార్యను దూషిస్తూ ఆస్తి పంచి ఇవ్వమని చిత్రహింసలకు గురిచేస్తున్నాడని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తనకున్న రెండంతస్తులు ఇంటిలో తల్లి అనికూడా చూడకుండా ఆస్థి కోసం పైనుండి కిందపడేసి చంపేందుకు కూడా వెనకాడటంలేదని చెప్పారు. తనను కూడా చంపుతానంటూ బెదిరిస్తున్నాడని రోజు కొడుకులు.. చిత్రహింసలు తట్టుకోలేక ఎవ్వరికి చెప్పుకోవాలో తెలియక తన భార్య మనోవేదనతో ఆత్మహత్యకు పాల్పడిందని కన్నీరు మున్నీరుగా విలపించిన తీరు తహసీల్దార్ గోపాలకృష్ణ, అధికారులను సైతం బాధించింది.

ధైర్యం చెప్పి భరోసా ఇచ్చిన తహసీల్దార్

ఆస్తుల కోసం కుమారులు వేధిస్తున్నారని తన కార్యాలయంలో అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన బాధితులకు తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ఓదార్చి ధైర్యం చెప్పారు. సీనియర్ వెల్ఫేర్ యాక్ట్ 2007 ప్రకారం చర్యలు తీసుకునేందుకు కూడా వెనకాడబోమన్నారు. పోలీస్ శాఖకు రక్షణ కల్పించాలని ఆదేశాలిస్తామన్నారు. కార్యాలయానికి పిలిచి కౌన్సెలింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు.

శిల్పి కాటూరికి సత్కారం

తెనాలి అర్బన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : చత్రపతి శివాజీ శిల్పాన్ని రూపొందించిన శిల్పి కాటూరి వెంకటేశ్వరరావును మంత్రి సత్యకుమార్ సత్కరించారు. జగ్గయ్యపేటలో సోమవారం శివాజీ మహారాజ్ పట్టాభిషేక దినోత్సవాన్ని పురస్కరించుకుని తాము రూపొందించిన విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించి అభినందించారని శిల్పి తెలిపారు. సూర్య శిల్పశాలలో రూపొందుతున్న వివిధ రకాల శిల్పాలను మంత్రిదృష్టికి తీసుకు వెళ్లామన్నారు. శాసన సభ్యులు శ్రీరామ్ రాజగోపాల్, సెంట్రల్ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురామ్, జనసేన అధ్యక్షులు సామినేని ఉదయభాను శిల్పిని అభినందించారు.



శిల్పి కాటూరిని సన్మానిస్తున్న మంత్రి సత్యకుమార్

షైనింగ్ స్టార్ ప్రతిభా అవార్డుల ప్రదానం

తెనాలి అర్బన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన కె.ఇందిరా ప్రియదర్శిని సోమవారం జిల్లా కలెక్టర్ వెంకటమురళి చేతుల మీదుగా షైనింగ్ స్టార్ అవార్డు అందుకుంది. చుండూరు మండలం చినపరిమికి చెందిన బాలిక కూచిపూడి సాక్రెడ్ హార్ట్ స్కూల్‌లో చదువుతూ 578 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానంలో నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వం అవార్డులు ప్రవేశపెట్టి విద్యార్థులను ప్రోత్సహించడం పట్ల పలువురు గ్రామస్తులు అభినందనలు తెలిపారు. మండలంలో మరో ఆరుగురు విద్యార్థులు మోదుగుల అమృత, షేక్ గౌస్ అహ్మద్, దేవిశ్రీ, జయసౌజన్య, చైతన్యశ్రీ, చిరంజీవి అవార్డులు అందుకున్న వారిలో ఉన్నారు.

● కొల్లిపర, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి 578 ఉత్తమ మార్కులు సాధించిన విష్ణుప్రియ కావేరికి కలెక్టర్ నాగలక్ష్మి, తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్, డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, ఆర్జేడీ పద్మ చేదుల మీదుగా సోమవారం 20వేల రూపాయల చెక్కును, మెడల్, సర్టిఫికెట్టు అందజేశారు. అవార్డు అందుకున్న విష్ణుప్రియ కావేరిని ప్రధానోపాధ్యాయురాలు సౌజన్య, పలువురు ఉపాధ్యాయులు ఈదా సాంబిరెడ్డి, సౌజన్య, వరనాగలక్ష్మి, అనంతలక్ష్మి, భూపతినాయుడు, శ్రీకాంత్‌నాయక్ నాగలక్ష్మి తదితరులు అభినందించారు.

● పొన్నూరు టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): 10వ తరగతిలో 588 మార్కులు సాధించిన ఎన్ఎస్‌టీ విద్యార్థిని పి.అనన్యకు షైనింగ్ స్టార్ అవార్డును సోమవారం జిల్లా కలెక్టర్ చేతుల మీదగా అందజేశారు. రూ 20 వేల నగదు, మెడల్‌ను జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ అందించారు. ఈ కార్యక్రమంలో డీఈవో రేణుక, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, పాఠశాల డైరెక్టర్ కొలిపర్తి శివనాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



కొల్లిపర: ఎమ్మెల్యే నజీర్ నుంచి అవార్డు అందుకుంటున్న విష్ణుప్రియ కావేరి



తెనాలి: అవార్డు అందుకుంటున్న ప్రియదర్శిని

గ్రామ వికాసానికి ప్రభుత్వం చేయూత

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల వికాసానికి కూటమి ప్రభుత్వం చేయూతనందిస్తోందని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. మండల పరిధిలోని సుద్ధపల్లిలో సోమవారం రూ.1.04 కోట్ల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనం, సిమెంట్ రోడ్లు, సీసీ డ్రైన్లు, తాగునీటి బోర్లు వంటివి శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు వంటివి జరిగాయి. పాఠశాలలో రూ.30 లక్షలతో నిర్మించే మూడు అదనపు తరగతి గదులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ పాలనలో గ్రామాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. గ్రామాల్లో రహదారులు లేక మురుగు పారక, మంచినీరు అందక ప్రజలు ఐదేళ్లపాటు అవస్థలు పడ్డారని గుర్తు చేశారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వ సహకారంతో పూర్తి చేయనున్నట్లు చెప్పారు. సుద్ధపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తిచేసి ప్రజలకు త్వరలోనే సాగునీరు అందించనున్నట్లు చెప్పారు. ప్రజలు వైసీపీ నాయకులపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు షైలా వెంకటరామరాజు, జనసేన మండల అధ్యక్షుడు చందు శ్రీరాములు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



సుద్ధపల్లిలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ ప్రారంభం

తెనాలి, మారీసుపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్, నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు. సోమవారం మార్కెట్ సెంటర్‌లోని పురపాలక సంఘ కార్యాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ముందుగా ఆయన జిల్లా విజన్, నియోజక విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్‌ను వర్చువల్‌గా ప్రారంభించి యూనిట్ మెంబర్లకు ఆదేశాలు జారీచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ శేషన్న, అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ శివన్నారాయణ, కౌన్సిలర్ పెదలంక లక్ష్మీలావణ్య, మున్సిపల్ ఇంజనీరింగ్ స్టాఫ్, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ సంజనా సింహాకు వినతిపత్రం అందిస్తున్న రైతులు

పసుపు రైతులకు పరిహారం అందించాలి

● రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకరరావు

తెనాలి అర్బన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదంలో నష్టపోయిన రైతులకు పరిహారం అందించకుంటే ప్రత్యక్షంగా ఆందోళనకు దిగుతామని రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకరరావు తెలిపారు. దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీలో జరిగిన అగ్ని ప్రమాదం కారణంగా నష్టపోయిన బాధితులకు 17నెలలు గడిచినా పరిహారం అందలేదన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ సంజనా సింహాకు వినతిపత్రం అందజేశారు. పంట మంచి ధర వచ్చే వరకు దాచుకుంటామంటే ధర రాకపోగా పంట మొత్తం కాలిపోయిందని, అప్పులకు బ్యాంకు వడ్డీలు పెరిగిపోతున్నాయని వాపోయారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి క్వింటాకు రూ.7వేలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మారీసుపేట న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ వద్ద ధర్నా చేయగా మంత్రి లోకేశ్ స్పందించి పరిహారం ఇస్తామని హామీ ఇచ్చిన అతీగతీ లేదన్నారు. బీమా సంస్థ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిహారం పరిష్కారానికి కృషి చేస్తామని సబ్ కలెక్టర్ హామీ ఇచ్చారు. ములకా శివసాంబిరెడ్డి, చంద్రశేఖర్, రంగారెడ్డి, సత్యనారాయణ, రామారావు, హుస్సేన్‌వలి పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల కోసం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

పెదకాకాని, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రభుత్వ భూములలో ఎన్నోయేళ్లుగా నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న పేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలని సోమవారం పెదకాకాని తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి మండల సీపీఎం కార్యదర్శి నన్నపనేని శివాజీ అధ్యక్షత వహించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పాశం రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు అరు లైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని వాగ్దానాలు చేశారన్నారు. అయితే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా వాగ్దానాన్ని నిలబెట్టుకోలేదన్నారు. పెదకాకాని మండలంలోని సుందరయ్య కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, స్వర్ణపురి కాలనీ,ఎస్టీ కాలనీ, జాన్ హేస్పర్, కాలనీ వడ్డెర కాలనీలలోని ప్రజలు 20సంవత్సరాలుగా 2000 మందికి పైగా కుటుంబాలు నివాసం ఉంటున్నాయని వెంటనే వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ పి.కృష్ణకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న పేదలకు వెంటనే ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తాను అన్నారు. ఇళ్ల పట్టాల సమస్యలు పరిష్కారంతోపాటు పలు కాలనీలలో మౌలిక సదుపాయాలు లేవని వాటిపై కూడా దృష్టి సారించి వెంటనే డ్రైనేజీ, రోడ్లు, అంగన్వాడి భవనాలు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు రాజా రమేష్, బురదగుంట సాంబయ్య, సంకూరి నీలాంబరం, ఉల్లంగుల శివయ్య, కే సత్యనారాయణ, బి బాబురావు, వివిధ కాలనీల వాసులు షేక్ హసీనా, దోసర మల్లేశ్వరి, తాత హైమావతి, ఏ నాగేశ్వరావు, ఏసు పాదం తదితరులు పాల్గొన్నారు.



ధర్నా అనంతరం తహసీల్దార్ కృష్ణకాంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

వైద్యుల సలహా మేరకు మందులు వాడుకోవాలి

● మండల వైద్యాధికారి నీహ

కొల్లిపర, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు వైద్యుల సలహా మేరకు మందులను వాడుకోవాలని మండల వైద్యాధికారి నీహ అన్నారు. సోమవారం కొల్లిపరలో వైద్యాధికారులు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపును నిర్వహించారు. వైద్యాధికారులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీచేసి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా నీహ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం వలన దీర్ఘకాలిక రోగాలను గుర్తించవచ్చునన్నారు. ప్రతి నెల నిర్వహించే ఎఫ్‌పీసీ క్యాంపులో మంచంలో ఉన్నవారికి కూడా ఇంటికి వెళ్ళి వైద్యసదుపాయం కల్పించనున్నట్లు తెలియజేశారు. గ్రామీణ ప్రజలు మెడికల్ క్యాంపును సద్వినియోగించు కోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ కల్యాణి, ఏఎన్ఎం మణిమ్మ, డీఈవో బొమ్ము కోటిరెడ్డి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన వేలంలో 981 బస్తాల పసుపు విక్రయాలు జరిగాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్టధర రూ.9,700, గరిష్టధర రూ.10,500, మోడల్‌ధర రూ.10,391 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్టధర రూ.9,700, గరిష్టధర రూ. 10,500 మోడల్‌ధర రూ.10,391 పలికాయి.

విద్యుత్‌శాఖ విజిలెన్స్ తనిఖీలు

● రూ.3.61 లక్షల అపరాధ రుసుం

తాడికొండ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ విజిలెన్స్ విభాగం, సీఆర్‌డీఏ సర్కిల్ ఆపరేషన్ విభాగ, పర్యవేక్షణ ఇంజనీర్ పీ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో, విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జే సంజీవరావు పర్యవేక్షణలో మండలంలోని పలు గ్రామాల్లో తనిఖీలను సోమవారం నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా 37మంది విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నట్లు గుర్తించి వారికి రూ. 3.61 లక్షల అపరాధ రుసుం విధించినట్లు విద్యుత్ ఏఈ నాగమల్లేశ్వరరావు పేర్కొన్నారు. మండలపరిధిలోని మోతడక, ముక్కామల, పొన్నెకల్లు, పెదకండ్రిక, పాములపాడు, ఫణిదరం, రావెల గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. 45మంది అధికారులు, 195మంది సిబ్బంది 45 బృందాలుగా ఏర్పడి 3106 విద్యుత్ సర్వీసులను తనిఖీలు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే 9440812263కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో డీఈఈలు మల్లికార్జునరావు కేవీ కోటేశ్వరరావు, ఏఈ కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మణిపాల్‌లో అరుదైన వ్యాధికి చికిత్స

తాడేపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కొన్ని ఆరోగ్య సమస్యలకు కేవలం యంత్రాలు, స్కాన్లు మాత్రమే చేయడం కాకుండా, వినూత్న నిర్ణయాలు ధైర్యంగా తీసుకుని ఓ రోగికి నయం చేశారు.. మణిపాల్ వైద్యులు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ 56 సంవత్సరాల వయసున్న వ్యక్తిని అతని బంధువులు మణిపాల్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. వైద్య పరీక్షల అనంతరం ఆ వ్యక్తికి మతిమరుపు, వాంతులు, నిర్లిప్తత, రుచిని పూర్తిగా కోల్పోవడం, నరాల సమస్యకు సంబంధిత లక్షణాలతో బాధపడుతున్నట్టు వైద్యులు నిర్ధారించారు. రేడియేషన్ అంకాలజీ నిపుణుడు డాక్టర్ రామకృష్ణ వంగర మాట్లాడుతూ రోగికి గతంలో తీసిన ఎమ్‌ఆర్‌ఐ స్కాన్‌లో మెదడులోని ముఖ్యమైన భాగాలైన థాలమస్, స్ప్లినియం, రైట్ లాటరల్ వెంట్రికల్ పక్కన అస్పష్టంగా ఒక గడ్డ కనిపించిందన్నారు. మొదట బయాప్సి ప్రకారం అది హానికరమైన ట్యూమర్ కాదని, పిలోయిడ్ గ్లియోసిస్ అని తెలిపారు. రిపోర్ట్ ప్రకారం ప్రమాదకరం కాదని చెప్తున్నా, రోజురోజుకు రోగి ఆరోగ్యం దిగజారుతుండడంతో బెంగళూరు నుంచి నిపుణులతో కూడిన బృందం ఈ కేసును పునఃసమీక్షించిందన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో రోగి కుటుంబసభ్యులతో చర్చించి, రేడియేషన్ చికిత్స ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఒక వారం లోపలే రోగి ఆరోగ్యంలో మంచి మార్పులు కనిపించాయని డాక్టర్ వంగర తెలియజేశారు. అరుదైన వ్యాధికి సమయస్ఫూర్తితో మెరుగైన చికిత్స అందించిన వైద్య బృందానికి రోగిబంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థాన వార్షికోత్సవం

పెదనందిపాడు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని అబ్బినేనిగుంటపాలెంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థాన 9వ వార్షిక వేడుకలు మంగళవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. స్వామికి దివ్యచండీహోమం, దివ్యశాంతి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్య దంపతులు పాల్గొంటారని తెలిపారు.

స్వర్ణాంధ్ర ర్యాలీ

ఫిరంగిపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురంలో మండల అధికారులు, డ్వాక్రా మహిళలు స్వర్ణాంధ్ర ర్యాలీని జరిపారు. సోమవారం ర్యాలీ అనంతరం పోలీసు స్టేషన్ సెంటర్లో మానవహారంగా ఏర్పడ్డారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రగా ఉండేందుకు అందరూ కృషి చేయాలని తహసీల్దార్ జే ప్రసాదరావు తెలిపారు. అంతేగాక ఏపీఎం నాగేశ్వరరావు నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీఈవో వెంకటేశ్వర్లు, ఏవో రవి కుమార్, యానిమేటర్లు, డ్వాక్రా లీడర్లు తదితర మండల అధికారులు పాల్గొన్నారు.

కౌలురైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

సీపీఎం నేత దొప్పలపూడి రమేష్‌బాబు

పెదనందిపాడు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): అప్పులపాలై ఇటీవల మరణించిన కౌలురైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్‌బాబు అన్నారు. మండలపరిధిలోని పుసులూరులో అప్పుల బాధ తాళలేక ఇటీవల ప్రత్తిపాడు మండలం గొట్టిపాడులో మృతి చెందిన శివశంకరవరప్రసాద్ కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. ప్రభుత్వం ఆ కుటుంబానికి రు.10లక్షలు ఆర్థిక సాయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జంపని రామారావు, నల్లమోతు రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో 'అంగన్‌వాడీ పిలుస్తోంది'

మంగళగిరి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామంలో సోమవారం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సెక్టార్ సూపర్‌వైజర్ బీజీ భవానీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు తాటి వెంకట్రావు, మండల ఉపాధ్యక్షుడు కొమ్మాసుకుమార్, మోతుకూరి రవి, శానం మాణిక్యరావు, మార్కెట్ యార్డు డైరెక్టర్ మన్నెం మల్లేశ్వరి, సచివాలయ సిబ్బంది, ఆశావర్కర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

గుంటూరు(తూర్పు), జూన్ 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. రూరల్ మండలపరిధి చల్లవారిపాలెంలో ఉపాధి హామీ, జేజేఎం నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డును, వాటర్ ట్యాంక్ నిర్మాణాలకు సంబంధించిన శిలాఫలకాలను సోమవారం ఆయన ఆవిష్కరించారు. పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. పనులను నిత్యం పర్యవేక్షిస్తూ, బిల్లులను ఎప్పటికప్పుడు చెల్లించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన యోగాంధ్ర కార్యాక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బండి శ్రీనివాసరావు, సర్పంచ్ ఆరుదుల సాంబశివరావు, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.


శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న బూర్ల రామాంజనేయులు

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

రూరల్ మండలం వెంగళాయపాలెంలో టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే రామాంజనేయులు ఆవిష్కరించారు. పేద ప్రజలకు ఎన్టీఆర్ అందించిన సేవలను ఆయన కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ లలితకుమారి, టీడీపీ నాయకులు కల్లూరి శ్రీనివాసరావు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అధికారుల సమక్షంలో ఆభరణాలు అప్పగింత

గుంటూరు(తూర్పు) (ఆంధ్రజ్యోతి): స్థానిక అమరావతి రోడ్డు, గోరంట్లలో ఉన్న శ్రీలక్ష్మి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని దేవదాయ ధర్మదాయశాఖ వారు స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఎమ్మెల్యే రామాంజనేయులు సమక్షంలో ఆలయ పూర్వపు అధ్యక్షుడు ఎర్రంశెట్టి వేణుగోపాలరావు స్వామికి చెందిన దాదాపు రూ.9 కోట్ల విలువ గల్గిన బంగారు, వెండి ఆభరణాలను ఆలయ ఈవో వెంకటేశ్వరరావుకు అప్పగించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధిలో వేణుగోపాల్ కృషి ఎనలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు బోన బోయిన శ్రీనివాస్ యాదవ్, గాదె వెంకటేశ్వరరావు, ఆలయ పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర 2047 కార్యాలయం ప్రారంభం

ప్రత్తిపాడు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర 2047 కార్యాలయాన్ని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ప్రారంభించారు. చంద్రబాబు విజన్‌కు అనుకూలంగా 2047 సంవత్సరానికి నియోజకవర్గ అభివృద్ధిలో పక్కా ప్రణాళికలు తయారు చేసేందుకు గాను నియోజకవర్గ స్థాయిలో కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. దీనిని జడ్పీ సీఈవో జ్యోతిబసుతో కలిసి ఎమ్మెల్యే రామాంజనేయులు ప్రారంభించారు. ఈ కార్యాలయానికి సంబంధించి ఐదుగురు సిబ్బందిని ప్రత్యేకంగా నియమిస్తున్నట్లు సీఈవో తెలిపారు. కార్యాలయం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఎమ్మెల్యే, సీఈవోతో పాటు ఎంపీడీవోలు పాల్గొన్నారు.

అక్రమంగా రుణం కొట్టేశారు

● డ్వాక్రా గ్రూపులను అడ్డుపెట్టుకొని రూ.50 లక్షలు పొందిన వైనం
● న్యాయం జరిపించాలని కలెక్టరేట్‌కు వచ్చిన బాధితులు


ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన డ్వాక్రా మహిళలు

గుంటూరు(తూర్పు), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నల్లపాడు, జీడీసీసీ బ్యాంకులో మరో అవి నీతి బాగోతం వెలుగులోకి వచ్చింది. డ్వాక్రా గ్రూపులను అడ్డుపెట్టుకొని అక్రమార్కులు రూ.50 లక్షల రుణాన్ని కొట్టేశారు. రుణం తీసుకున్న విషయం బాధితులకు కూడా తెలియకపోవటం మరో విచిత్రం.. రుణం కట్టాలని బ్యాంకు నుంచి నోటీసులు పంపే వరకు ఈ కుంభకోణం వెలుగులోకి రాలేదు. విషయం తెలుసుకున్న బాధితులు షాక్‌కు గురై.. న్యాయం చేయాలంటూ కలెక్టరేట్‌లో జేసీఏ భార్గవతేజ్‌కు వినతిపత్రం అందజేశారు. బాధితులు మాట్లాడుతూ గుంటూరు రూరల్ పరిధిలో అంకిరెడ్డిపాలెంలో శివశంకరి, పావని మహిమ, కరుణామయి, ఇందిర మహిళ పేర్లుతో గ్రూపులను ఏర్పాటు చేసి రుణాలు తీసుకుంటూ స్వయం ఉపాధి పొందుతున్నామని తెలిపారు. మొదటి నుంచి నగరంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో లావాదేవీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్రామంలో ఆర్పీగా విధులు నిర్వహిస్తున్న సోనియా అనే మహిళ ఈసారి మీకు నల్లపాడు, జీడీసీసీ బ్యాంకులో రుణం జారీ చేశారని చెప్పడంతో దీంతో బ్యాంకుకు వెళ్లి కొన్ని పత్రాలపై సంతకాలు చేశామని వివరించారు. తొలుత మీకు రూ.10 లక్షలు ఇస్తామని చెప్పి ఒక్కొక్క గ్రూపుకి రూ.6.5 లక్షలు మాత్రమే ఇస్తామని బ్యాంకు అధికారులు చెప్పడంతో ఆ రుణాన్ని నిరాకరించామని అన్నారు. సంతకాలు చేసిన పత్రాలను నేను తీసుకువస్తానని సదరు ఆర్పీ చెప్పడంతో వెనక్కి వచ్చామని తెలిపారు. ఇది జరిగి దాదాపు నాలుగేళ్ల గడుస్తుందని చెప్పారు. బ్యాంకు అధికారులు 2021లో మీరు తీసుకున్న రుణం చెల్లించాలని గత నెల 31న నోటీసులు పంపారని తెలిపారు. నాటి సంతకాలను అడ్డం పెట్టుకొని బ్యాంకు అధికారులతో కుమ్మక్కై ఆర్పీ రుణం తీసుకుందని వాపోయారు. ఈ కుంభకోణంలో బ్యాంకు అధికారుల పాత్ర ఉందన్నారు. దాదాపు ఐదు గ్రూపులను అడ్డం పెట్టుకొని రుణాన్ని పొందారని, దీనిపై విచారణ జరిపించాలన్నారు. నోటీసులు వెనక్కి తీసుకోవాలని కోరారు.

విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేందుకే షైనింగ్ స్టార్ అవార్డులు

● ఎమ్మెల్యే నసీర్, కలెక్టర్ నాగలక్ష్మి


ముట్లూరు విద్యార్థులకు నగదు చెక్కు, సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్, కలెక్టర్ నాగలక్ష్మి

షైనింగ్ స్టార్ అవార్డులకు ఎంపికైన విద్యార్థులు సోమవారం గుంటూరు బీ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్, కలెక్టర్ నాగలక్ష్మీ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ఆయా పాఠశాలల యాజమాన్యం కాళహస్తి సత్యనారాయణ(విశ్రాంత ఏఎస్పీ), సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ లావు రత్తయ్య, కోశాధికారి లావు ఆదిశేషయ్య, నర్రా బాలకృష్ణ, పలువురు విద్యార్థులను అభినందించారు.


విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

వట్టిచెరుకూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపడంతో పాటు ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం షైనింగ్ స్టార్ అవార్డుల లక్ష్యమని ఎమ్మెల్యే నసీర్ అహ మ్మద్, కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. గుంటూరు లోని పొన్నూరు రోడ్డులో గల బీ కన్వెన్షన్ హాల్లో 10వ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డుల ప్రధానోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఆరుగురు అవార్డులకు ఎంపిక కాగా వారికి ఎమ్మెల్యే నసీర్, కలెక్టర్ నాగలక్ష్మిల చేతుల మీదుగా ఒక్కొక్కరికి రూ.20వేల నగదు చెక్కు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో డీఈవో రేణుక, డీవైఈవోలు, వట్టిచెరుకూరు- 2 ఎంఈవో నిర్మల, హెచ్‌ఎం జోష్‌మేరి, అధ్యాపకులు పాల్గొన్నారు.

● పెదనందిపాడు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పది పరీక్షల్లో అత్యధిక ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రభుత్వం అందించనున్న

కాకుమాను జడ్పీ విద్యార్థులు

కాకుమాను, జూన్ 9(ఆంధ్రజ్యోతి): 10వ తరగతిలో పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన కాకుమాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రిషిత, ఆస్మాలకు షైనింగ్ స్టార్ అవార్డు సోమవారం కలెక్టర్ చేతుల మీదగా అందుకున్నారు. అవార్డుతో పాటు ధ్రువీకరణపత్రం రూ.20 వేల నగదును కలెక్టర్ విద్యార్థులకు అందించారు.

వీజే విద్యార్థినులకు

మంగళగిరి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన ప్రతిభా పురస్కారాలకు మంగళగిరి వీజే జూనియర్ కళాశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. వీజే విద్యార్థినులు బియ్యపు ప్రవల్లిక, గుర్రం రమ్యకు ఎమ్మెల్యే నసీర్, కలెక్టర్ నాగలక్ష్మి నుంచి పురస్కారాలను అందుకున్నారు.

యోగాని జీవన విధానంలో భాగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే రామాంజనేయులు


ఎర్రబాలెంలో ప్రతిజ్ఞ చేస్తున్న కూటమి నాయకులు

గుంటూరు కార్పొరేషన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): యోగాని ప్రతి ఒక్కరూ జీవనవిధానంలో భాగం చేసుకుంటే సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందడానికి వీలుంటుందని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన యోగాంధ్ర 2025లో భాగంగా కలెక్టరేట్ నుంచి నగరంపాలెం 3 బొమ్మల సెంటర్ వరకు యోగాపై అవగా హన ర్యాలీ జరిగింది. ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఆరోగ్యమే కీలకమని, ప్రస్తుతం ప్రజలెదు ర్కొంటున్న అనేక ఆరోగ్య రుగ్మతలను యోగా ద్వారా తగ్గించుకోవచ్చన్నారు.

యోగా ప్రాముఖ్యంపై విస్తృత ప్రచారం

మంగళగిరి సిటీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగా మాసోత్సవంలో భాగంగా దైనందిన జీవితంలో యోగా ప్రాముఖ్యాన్ని తెలియజేస్తూ మంగళగిరి పట్టణం, మండలంలో సోమవారం పలు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఎర్రబాలెంలో తెలుగుమహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య మాట్లాడుతూ ప్రతిరోజు యోగ చేయడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగు పడుతుందని చెప్పారు. మంగళగిరి 8, 9 వార్డుల పరిధిలో వీవర్స్ కాలనీ, ఆంజనేయ కాలనీల్లో ర్యాలీలు నిర్వహించారు.

● దుగ్గిరాల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ ఆరోగ్యానికి యోగసాధనే మార్గమని టీడీపీ వాణిజ్యవిభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకట్రావు అన్నారు. దుగ్గిరాలలో యోగాంధ్ర అవగాహన ర్యాలీ సోమవారం నిర్వహించారు. మండలస్థాయి అధికారులతోపాటు, పంచాయతీ సిబ్బంది, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు డ్వాక్రా మహిళలు, ఎంపీడీవో కార్యాలయం నుంచి శివాలయం సెంటర్ వరకూ ర్యాలీ కొనసాగించారు.

● కాకుమాను, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మానసిక ఒత్తిడిని జయించడానికి యోగాభ్యాసనం ఉత్తమ మార్గమని ఎంపీడీవో యుగకీర్తి అన్నారు. కాకుమానులో యోగాంధ్ర అవగాహన ర్యాలీ జరిగింది.

● పెదనందిపాడు (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో యోగాంధ్రప్రదేశ్‌లో భాగంగా యోగాపై అవగాహనా ర్యాలీలు నిర్వహించారు.

పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే ధ్యేయం

● సంగం డెయిరీ డైరెక్టర్లు దేవిరెడ్డి, గొల్లపూడి


పాల రైతులకు బోనస్ నగదు చెక్కులను అందజేస్తున్న సంగం డెయిరీ డైరెక్టర్‌లు దేవిరెడ్డి, గొల్లపూడి

పెదనందిపాడు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే సంగం డెయిరీ ధ్యేయమని డైరెక్టర్లు దేవిరెడ్డి వెంకట సుబ్బయ్య, గొల్లపూడి శ్రీనివాసరావులు అన్నారు. మండలపరిధిలోని నాగులపాడు పాల ఉత్పత్తిదారుల సహకారం సంఘ కార్యాలయంలో సోమవారం పాల రైతులకు బోనస్ పంపిణీ చేశారు. 149 మంది రైతులకు రూ.6,65,728ల నగదును పంపిణీ చేశారు. కార్యక్రమంలో జోనల్ మేనేజర్ తెల్లప్రోలు వీరేంద్రకుమార్, ఏరియా ఫీల్డ్ కోఆర్డినేటర్ ముత్తవరపు సుధీర్‌బాబు, రూట్ సూపర్‌వైజర్ తలారి గంగాధర్, కార్యదర్శి గొల్లపూడి వాసు, సభ్యులు కమ్మ సురేష్, కాపు దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలలుగా పింఛను రావడం లేదు

● పీజీఆర్‌ఎస్‌లో కొండేపాడు వాసి ఫిర్యాదు


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న కొండేపాడు వాసి పచ్చల శ్రీనివాసరావు

ప్రత్తిపాడు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తనకు ఆరు నెలలుగా పింఛను ఇవ్వక పోగా తాను ఊరిలోనే లేనట్టు డోర్ లాక్ అంటూ చూపుతున్నారని కొండేపాడు గ్రామానికి చెందిన పచ్చల శ్రీనివాసరావు తహసీల్దార్ కరుణకుమార్ వద్ద మొరపెట్టుకున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. కొండేపాడు గ్రామస్థుడు శ్రీనివాసరావు తనకు పింఛను ఇవ్వకుండా ఆపడానికి గల కారణాలను చెప్పాలంటూ వేడుకున్నాడు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలంటూ తహసీల్దార్‌ను కోరాడు.

ఇంటర్ విద్యార్థినుల ఆందోళన



తాడేపల్లిలోని సోషల్ వెల్ఫేర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న మహిళా విద్యార్థులు

తాడేపల్లి టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిలోని ఏపీ సోషల్ వెల్ఫేర్ కార్యాలయం వద్ద ఇంటర్ మీడియట్ విద్యార్థినులు సోమవారం ఆందోళన నిర్వహించారు. కృష్ణా జిల్లాలోని ఈడుపుగల్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఐఐటీ, నీట్ మహిళా అకాడమి (గురుకుల పాఠశాల)లో ఇంటర్మీడియట్ విద్యార్థినులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. అకాడమిని ప్రస్తుతం ఉన్నచోటు నుంచి గుంటముక్కల, మైలవరం మండలానికి తరలించాలని ప్రభుత్వం ప్రతిపాదించడం వల్ల ఆందోళనకు గురవుతున్నామని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థినుల భవిష్యత్తును ఆలోచించి అకా డమిని ఇంటర్ రెండో సంవత్సరం పూర్తయ్యే దాకా ఈడుపుగల్లులోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం సోషల్ వెల్ఫేర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

నేడు కాజ గ్రామంలో ఏరువాక ఉత్సవం

మంగళగిరి సిటీ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం కాజ గ్రామంలో ఏరువాక పౌర్ణమి ఉత్సవాలు మంగళవారం జరుగనున్నాయి. గ్రామ నడిబొడ్డున గల శ్రీరత్నర్భ విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రతియేటా ఏరువాక పండుగను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఉత్సవాల కోసం అన్ని ఏర్పాట్లను పూర్తిచేసినట్టు ఉత్సవ పెదకాపులు తెలిపారు. వ్యవసాయం మానవ మనుగడకు జీవనాధారమే విషయాన్ని తెలియజేస్తూ ఏటా వర్షాకాల సీజను ఆరంభంలో జ్యేష్ఠ పౌర్ణమి నాడు సంప్రదాయబద్ధంగా జరుపుకుంటారు. అలంకరించిన అరకలను, ట్రాక్టర్లను మేళతాళాలతో తీసుకుని వచ్చి విఘ్నేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తారు. ఉత్సవ పెదకాపులు సింహాద్రి వెంకట రామారెడ్డి, కుక్కల కోటేశ్వరరావు, చెన్నం శ్రీనివాసరావు, బొమ్మ పిచ్చిరెడ్డి విఘ్నేశ్వరస్వామి ఆలయానికి నాలుగు వైపులా వున్న స్తంభాలపై నిలబడి ఉండ్రాళ్ల ప్రసాదాన్ని భక్తులకు పంచిపెడతారు.

ధూమపానం, మద్యపానంనకు దూరంగా ఉండాలి

తాడికొండ(పొన్నెకల్లు), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ధూమపానం, మద్యపానంనకు అందరూ దూరంగా ఉండాలని పొన్నెకల్లు పీహెచ్‌సీ వైద్యుడు బీఎస్‌కే భార్గవ్ పేర్కొన్నారు. సోమవారం వరల్డ్ హైపర్ టెన్షన్ డే సందర్భంగా పొన్నెకల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భార్గవ్ మాట్లాడుతూ అధిక రక్తపోటు ఉన్నవారు జంక్‌ఫుడ్ తీసుకోరాదని తెలిపారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు.

ఫ్యాక్టరీ ప్రీమియం లీగ్ విజేత బీఆర్‌ఎస్ 11 జట్టు

● నారా లోకేశ్ సహకారంతో లక్షా 50వేల బహుమతులు

తాడేపల్లి టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో తాడేపల్లి పట్టణంలోని బ్రహ్మానంపురం హైస్కూల్లో 15 రోజులుగా జరుగుతున్న ఫ్యాక్టరీ ప్రీమియం లీగ్ క్రికెట్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. పోటీల్లో గెలుపొంది ప్రథమ స్థానంలో నిలిచిన బీఆర్‌ఎస్ 11జట్టుకు రూ.లక్ష, ద్వితీయ స్థానంలో నిలిచిన రెడ్ చిల్లీస్ జట్టుకు రూ.50వేలు రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి సహకారంతో విజేతలకు నిర్వాహకులు అందజేశారు. మంగళగిరి నియోజకవర్గంలో వివిధ రకాల టోర్నమెంట్లు నిర్వహించి ఈ ప్రాంతానికి క్రీడల్లో మంచి గుర్తింపు తీసుకురావడం కోసం మంత్రి నారా లోకేశ్ ఎంతో కృషి చేస్తున్నారని నిర్వాహకులు కొనియాడారు. బహుమతి ప్రదానోత్సవంలో పాల్గొన్న నియోజకవర్గ పరిశీలకులు ముమ్మడి సత్యనారాయణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావులు మాట్లాడుతూ యువత ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. అభివృద్ధి, సంక్షేమంతో పాటు క్రీడలు ముఖ్యమని భావించిన మంత్రి నారా లోకేశ్, మంగళగిరిని క్రీడా హబ్‌గా రూపొందించేలా చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రతి ఏడాది ప్రైడ్ ఆఫ్ మంగళగిరి పేరుతో సొంత నిధులు వెచ్చించి కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారని అన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించి వారికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా తీర్చిదిద్దడమే మంత్రి నారా లోకేశ్ లక్ష్యమన్నారు. దీని లో భాగంగా అన్ని రకాల క్రీడాకారులకు మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకొచ్చారని అన్నారు. త్వరలో ప్రభుత్వ సహకారంతో మంగళగిరిలో అన్ని వసతులతో కూడిన అతి పెద్ద క్రీడా మైదానాన్ని కూడా అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. రాష్ట్ర, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఆర్థికసాయం లోకేశ్ అందజేస్తున్నారని అన్నారు.

రాజధాని మహిళలను కించపరిచిన వారిని శిక్షించాలి


కంతేరులో కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు దిష్టిబొమ్మలు దహనం చేస్తున్న మహిళలు

తాడికొండ(కంతేరు), జూన్ 9(ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలను కించపరిచిన వారికి కఠిన శిక్షలు పడాలని కంతేరు గ్రామంలోని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ మీడియాలో అమరావతి మహిళలను అసభ్యకరంగా మాట్లాడిన కొమ్మినేని శ్రీనివాసరావు, వీవీఆర్ కృష్ణంరాజు దిష్టిబొమ్మలను కంతేరులో టీడీపీ నాయకులు, మహిళలు సోమవారం దహ నం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాజ ధాని ప్రాంతంలో నివసిస్తున్న మహిళలందరినీ కించపరిచే విధంగా మాట్లాడటం సబబు కాదన్నారు. ప్రభుత్వం వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కనీసం మహిళలకు క్షమాపణం కూడా చెప్పకుండా అహంకార పూరితంగా వ్యవహరించిన తీరు జుగుప్సాకరంగా ఉందన్నారు.

మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి

● టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దానబోయిన

మంగళగిరి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలను కించపరిచేలా మాట్లాడిన కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావు, వారిని ప్రోత్సహించిన సాక్షి యాజమాన్యం బహిరంగ క్షమాపణ చెప్పాలని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్ డిమాండ్ చేశారు. అమరావతి జేఏసీ మహిళలు రాజధాని కోసం శాంతియుతంగా ఉద్యమాలు చేస్తుంటే గత ప్రభుత్వం రాజ్యాంగాన్ని ఉల్లంఘించి పోలీసులచే కొట్టించిందని గుర్తుచేశారు. ఇది చాలదన్నట్టు ఇప్పుడు కూడా మహిళలను లక్ష్యంగా చేసుకుని సాక్షి మీడియాలో అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. మహిళలను అవమానించిన వారు బహిరంగ క్షమాపణలు చెప్పని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెలుపుతామని హెచ్చరించారు.

ప్రత్తిపాడులో జగన్ పత్రిక దహనం


ప్రధాన రహదారిలో సాక్షి ప్రతులను తగలబెడుతున్న మహిళలు, కూటమి నాయకులు

ప్రత్తిపాడు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అమరావతి వేశ్యల రాజధాని అంటూ జగన్ మీడియాలో చేసిన వ్యాఖ్యలపై కూటమి నేతలతో మహిళలు మండిపడ్డారు. ప్రత్తిపాడులో తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి మహిళలు, దేశం నాయకులు ర్యాలీ నిర్వహించారు. కృష్ణంరాజు, కేఎస్‌ఆర్‌లను అరెస్టు చేయాలంటూ నినాదాలు చేశారు. బహిరంగంగా భారతి క్షమాపలు చెప్పాలంటూ డిమాండ్ చేశారు. తొలుత ప్రత్తిపాడు ఎస్‌ఐకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసిన కూటమి నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గింజుపల్లి శివరామప్రసాద్, కాకాని సురేష్‌బాబు, కుర్రి సుబ్బారెడ్డి, కాసు పెంటారెడ్డి, పమిడి శ్రీనివాసరావు, మాకినేని జగన్ మోహన్, మల్లం పరమేశ్వరరావు, చెన్నుబోయిన శ్రీనివాసరావు, గొరిజవోలు శ్రీనివాసరావు, ఆలపాటి పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావులపై ఫిర్యాదు

కాకుమాను, జూన్ 9(ఆంధ్రజ్యోతి): వైఎస్ భారతిరెడ్డికి చెందిన న్యూస్ చానల్ డిబేట్‌లో రాజధాని అమరావతి ప్రాంత మహిళలపై అసభ్యకరరీతిలో చర్చ జరిపిన కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ మండల నాయకులు సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సంగం డెయిరి మాజీ చైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి, మండల అధ్యక్షుడు మామిళ్లపల్లి రాంగోపాల్, నువ్వుల సునీల్ చౌదరి, నల్లమోతు పూర్ణచంద్రరావు, ప్యారీజాన్, దేవిరెడ్డి శ్రీనివాసరావు, పద్మజారాణి, రత్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

సీఐ శివరామకృష్ణకు ఫిర్యాదు


ఫిరంగిపురం సీఐ శివరామకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నేత కొత్తపల్లి కోటేశ్వరరావు

ఫిరంగిపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఫిరంగిపురంలో టీడీపీ మండల కార్యాల యం నుంచి పోలీసుస్టేషన్ వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ చేశారు. సోమవారం ఈ ర్యాలీలో డౌన్ డౌన్ సాక్షి పేపర్, ఉన్మాదులైన కొమ్మినేని శ్రీనివాస్, కృష్ణంరాజు లను అరెస్టు చేయాలంటూ నినదించారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యవర్గ కార్యదర్శి కొత్తపల్లి కోటేశ్వరరావు మాట్లాడుతూ రాజధాని మహిళలను అసభ్య కరంగా మాట్లాడటం హేయమన్నారు. సీఐ శివరామకృష్ణకు కొమ్మినేని, కృష్ణం రాజులపై కేసును నమోదు చేయాలని వారు కోరారు. కార్యక్ర మంలో టీడీపీ మండల అధ్యక్షుడు మండవ నరసింహారావు, కటికల అప్పారావు, కే యోహాన్, పీ లూర్దయ్య, బందనాథం సతీష్, కోటా శేషు, దివ్య, బీజేపీ నాయకులు చంద్ర శేఖర్, జనసేన నాయకులు రామిరెడ్డి, గుండెగ జోజి, కటికల రామకోటేశ్వర రావు, కొండలు, ప్రసన్న, రమేష్‌లు పాల్గొన్నారు.